INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

సోమవారం 19.08.2024
INK OF TRUTH
# జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
సంపుటి - 32 సంచిక -182 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

వివరాలు 2వ పేజీలో

## మమతా బెనర్జీపై విశ్వాసం పోయింది

- అది ఆత్మహత్య కాదని ముందే చెప్పా
- కోల్ కతా వైద్యురాలి తల్లి




## తిరుపతి టీడీఆర్ బాండ్ల స్కాంపై చర్యలు

- సిద్ధమవుతున్న ప్రభుత్వం




## కోల్‌కతా హత్యాచార కేసు.. సుమోటోగా స్వీకరించిన




## వాసుదేవరెడ్డి అరెస్ట్ !?

# వణికిపోతున్న వైసీపీ

**పొలిటికల్ డెస్క్ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భారీ మద్యం కుంబకోణంలో కీలక సూత్రధారిగా భావిస్తున్న వాసుదేవరెడ్డిను పట్టేసుకున్నారంటూ వస్తున్న వార్తలు వైసీపీ ని వణికిస్తున్నాయి.. మద్యం కుంభకోణంలో కీలకమైన మద్యం దొంగ వాసుదేవరెడ్డి పోలీసులకు దొరికాడు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మద్యం కుంభకోణంలో తనను అరెస్టు చేస్తారేమోనన్న భయంతో ఫైల్స్‌తో పరార్ అయిన బేవరేజ్ కార్పొరేషన్ ఎండి వాసుదేవరెడ్డి పరార్ అయ్యారు. దాదాపు రెండు నెలల నుంచి ఆయన పరార్‌లో ఉన్నారు. ఆయనను పట్టుకోవడానికి సీఐడీ అధికారులు ఎంత ప్రయత్నించినా ఆయన దొరకలేదు. ఆయన నివాసంలో, హైదరాబాద్‌లోని ఆయన ఇంటికి సీఐడీ అధికారులు నోటీసులు అంటించారు. అయితే..ఆయన రహస్య జీవితం గడుపుతుండడంతో సీఐడీ అధికారులను ఆయనను పట్టుకోవడానికి ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేశారు. ఎట్టకేలకు ఆయన ఆచూకి ఈరోజు సీఐడీ అధికారులను లభించింది. దీంతో ఆయనను అరెస్టు చేసి ఒక ప్రత్యేక ప్రదేశంలో ఆయనను విచారిస్తున్నారు. జగన్ అధికారంలో ఉన్నప్పుడు వాసుదేవరెడ్డి బేవరేజ్ కార్పొరేషన్



ఎండిగా నియమించారు. జగన్ కోసమే వాసుదేవరెడ్డి పనిచేశారనే ఆరోపణలు ఉన్నాయి. మద్యం ఆదాయాన్ని చూపి భారీగా అప్పులు తేవడంతోపాటు, నాసిరకం మద్యాన్ని ఎక్కువ రేటుకు అమ్మడం, డిస్టిలర్‌తో ఒప్పందాలు, ఊరూ పేరు లేని బ్రాండ్‌లు తేవడం, మద్యం కొనుగోళ్లలో అక్రమాలు, మద్యం షాపుల్లో నగదు రహిత అమ్మకాలు లేకపోవడంతో పాటు పలు ఆరోపణలను వాసుదేవరెడ్డి ఎదుర్కొంటున్నారు.

వాసుదేవరెడ్డి హయాంలో బేవరేజ్ కార్పొరేషన్‌లో దాదాపు రూ. 40వేలకోట్ల రూపాయల అవినీతి జరిగిందని టిడిపి ఆరోపిస్తోంది. ఇది ఢిల్లీ మద్యం కుంభకోణం కంటే ఎక్కువని కూడా ఆ పార్టీ చెబుతోంది. తాము అధికారంలోకి వచ్చిన తరువాత..దీనిపై విచారణ చేస్తామని ప్రకటించింది. చెప్పినట్లుగానే.. కూటమి ప్రభుత్వం మద్యం అక్రమాలు,

2 లో

## జగన్ గారి.. ఎగ్ పఫ్ బిల్లు

# జస్ట్ రూ.3.6 కోట్లే !

- హాట్ టాపిక్‌గా మారిన మాజీ సీఎం మేత



**పొలిటికల్ డెస్క్ ( జర్నలిస్ట్ ఫైల్ ):** గడచిన ఐదేళ్లలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరియు ఆయన సిబ్బంది తమ పదవిని, అధికారాన్ని దుర్వినియోగం చేసి ప్రభుత్వ ధనాన్ని తమ ప్రయోజనాల కోసం వాడుకున్నారని పలుమార్లు ఆరోపణలు వచ్చాయి. అప్పటి ప్రతిపక్షాలు 2019-2024 మధ్య ప్రభుత్వమే అధికారికంగా జారీ చేసిన జీవోలు, బిల్లులను బయటపెట్టి, జగన్ ప్రభుత్వం ఏ విధంగా కోట్ల రూపాయలను దోచుకున్నారో చూపించాయి. ఇప్పుడు జగన్ మోహన్ రెడ్డి సర్కారు అధికారం కోల్పోయిన తరువాత, ఆయన పాలనలో జరిగిన ఆర్థిక అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి.

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో ఓటమి తర్వాత, జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్‌డీఏ) ప్రభుత్వం, గత ఐదేళ్లలో జరిగిన కుంభకోణాలపై కఠిన చర్యలు తీసుకోవడానికి సీరియస్‌గా దర్యాప్తు చేపడుతుంది. ప్రతి రోజూ మరిన్ని అవకతవకలు వెలుగులోకి వస్తున్నాయి.

తాజా ఆరోపణ ఏంటంటే, ముఖ్యమంత్రి కార్యాలయం గత ఐదేళ్లలో అక్కడ పనిచేసిన సిబ్బందికి ఎగ్ పఫ్స్ అందించడానికి ఆశ్చర్యకరమైన రూ. 3.62 కోట్లను ఖర్చు చేసింది.

ప్రతీ ఏడాదికి సగటుగా 72 లక్షల రూపాయలను ఈ ఆహార

2 లో

## శ్రీసిటీలో పలు ప్రాజెక్టులను ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** తిరుపతి జిల్లా శ్రీసిటీలో నేడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉండవల్లిలోని తన నివాసం నుండి ఉదయం 10 గంటలకు బయలుదేరి, 11.30 గంటలకు తిరుపతి ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుండి హెలికాప్టర్ ద్వారా శ్రీసిటీకి వెళ్ళి పలు ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు.

శ్రీసిటీలో 15 కొత్త సంస్థల కార్యకలాపాలను ప్రారంభించడంతో పాటు, మరో 7 సంస్థల ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టులు రూ. 900 కోట్ల పెట్టుబడులతో నెలకొల్పబడుతుండగా, వాటి ద్వారా 2,740 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

అదేవిధంగా, రూ. 1,213 కోట్ల పెట్టుబడులకు సంబంధించి నాలుగు ప్రముఖ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకోనుంది. అనంతరం, శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో పలు కంపెనీల సీఈఓలతో ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించనున్నారు.

శ్రీసిటీలో పర్యటన అనంతరం చంద్రబాబు నాయుడు నెల్లూరు జిల్లా లోని సోమశిల సాగునీటి ప్రాజెక్టును సందర్శిస్తారు. ఆయన పర్యటన ముగిసిన తరువాత సాయంత్రం తిరిగి ఉండవల్లి చేరుకుంటారు.



## పోలవరం ఫైల్స్ దగ్ధం.. నలుగురిపై సస్పెన్షన్ వేటు



**తూర్పు గోదావరి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** పోలవరం ఫైల్స్ దగ్ధం ఘటనపై కలెక్టర్ ప్రశాంతి సీరియస్ అయ్యారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నలుగురిపై సస్పెన్షన్ వేటు వేశారు. మరో ఇద్దరికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సీనియర్ అసిస్టెంట్లు కే. నూకరాజు, కారం బేబి, స్పెషల్ ఇన్స్పెక్టర్ కే. కళాజ్యోతి, ఆఫీస్ సబార్డినేటర్ సస్పెన్షన్కు గురయ్యారు. డిప్యూటీ తహశీల్దార్లు ఏ. కుమారి, ఏ. సత్యదేవికి నోటీసులు జారీ చేశారు. కాగా, పోలవరం ప్రాజెక్టు ఫైళ్లను గత శుక్రవారం రాత్రి తగలబెట్టేశారు. కొత్త బీరువాలు కొని పాతవన్నీ క్లీన్ చేస్తూ వేస్ట్ పేపర్లను దహనం చేసినట్టు అధికారులు చెబుతున్నారు. పోలవరం ప్రధాన ఎడమ కాలువ పనుల కోసం చేపట్టిన భూసేకరణ చెల్లింపుల్లో భారీ స్కామ్ జరిగినట్టు ఆరోపణలు రావడం, ఈ సమయంలో ఫైళ్లు దగ్ధం కావడంతో ప్రభుత్వ పెద్దలు సీరియస్ అయ్యారు. దీనిపై కలెక్టర్ విచారణకు ఆదేశించి.. విధుల్లో నిర్లక్ష్యం చేసిన వారిపై యాక్షన్ తీసుకున్నారు.

## జగన్ కు ప్రజాస్వామ్యంలో ఉండటానికి అర్హత లేదు



**పాలకొల్లు( జర్నలిస్ట్ ఫైల్ ) :** యువతకు గంజాయి సంస్కృతిని నేర్పిన వైఎస్ జగన్‌కు ప్రజాస్వామ్యంలో ఉండటానికి అర్హత లేదని ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు మండిపడ్డారు. జగన్ తన ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో ఒక్క అభివృద్ధి పని చేయకపోయినా.. ప్రతి ఒక్కరిపై రూ. 2.50 లక్షల అప్పు ఉంచారని విమర్శించారు. జగన్ తన విధ్వంసకర పాలనకు ప్రజావేదిక కూల్చివేతతో శ్రీకారం చుట్టారని అన్నారు.

యలమంచిలి మండలం కాంబొట్లపాలెంలో వరద బాధితులకు మంత్రి నిమ్మల రామానాయుడు నిత్యవసర సరుకులను అందజేశారు. అలాగే రూ. 10 లక్షల వ్యయంతో రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పాలకొల్లులోని తన కార్యాలయానికి వచ్చిన ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యల కొన్నింటికి అక్కడికక్కడే పరిష్కారం అయ్యేలా సంబంధిత అధికారులతో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో వైసీపీ విష ప్రచారం చేస్తోందని మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. డయాఫ్రమ్‌వాల్‌పై నివేదిక రాకముందే లేని పోని అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు.

## 48 గంటల్లో నెరవేరిన చంద్రబాబు హామీ

### ఆటో డ్రైవర్ కుటుంబంలో ఆనందోత్సాహాలు



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** సీఎం చంద్రబాబుకు ఏ పనైనా ఆఘమేఘాల మీద చేయడం అలవాటు! గుడివాడలో ఓ ఆటో డ్రైవర్‌కు ఇచ్చిన మాటను రెండ్రోజుల్లోనే నెరవేర్చి పాలనలో వేగాన్ని మాటల్లో కాకుండా చేతల్లో చూపారు. చంద్రబాబు వేగానికి ఆటోవాలా అబ్బురపడ్డారు.

గుడివాడలో సీఎం చంద్రబాబు, ఆటోడ్రైవర్ రజనీకాంత్ మధ్య ఆగస్టు 15న జరిగిన సంభాషణ. అన్నక్యాంటీన్ ప్రారంభోత్సవం సందర్భంగా స్థానికులతో ముఖాముఖి నిర్వహించిన చంద్రబాబు కృష్ణా జిల్లా వలివర్తిపాడుకు చెందిన ఆటో డ్రైవర్ రేమల్లి రజనీకాంత్‌తో మాట్లాడారు. ఆయన కుటుంబ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆటో నిర్వహణ గురించీ ఆరా తీశారు! ఆ క్రమంలో రజనీకాంత్‌కు ఎలక్ట్రిక్ ఆటో సమకూరుస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు.

2 లో

# పోలీస్ అధికారుల సంఘంతో 'వైసీపీ బంతాట'

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** గత ఐదేళ్లలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన అనంతరం అత్యంత దుర్మార్గమైన, హేయమైన రాజకీయాలను అమలు చేసింది. ఈ కాలంలో వైసీపీ నడిపిన రాజకీయ ఉగ్రవాదానికి ఎంతో మంది బలయ్యారు. ఇప్పుడు ఆ బాధితుల గాధలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి.ఏ అధికారులైతే తెలుగుదేశం పార్టీకి సన్నిహితంగా ఉంటారో... అటువంటి అధికారులను వెతికి మరీ.. వారి చేతనే టీడీపీకి వ్యతిరేకంగా చర్యలు తీసుకునేలా అనేక రకాలుగా హింసించి రాక్షసానందం పొందేవారు. ఐఏఎస్ , ఐపీఎస్ అధికారుల నుంచి ఉద్యోగ సంఘాల నేతలపై సైతం ఇదే రకమైన పైశాచిక వ్యూహం అమలు చేశారు. గత ప్రభుత్వ పాలనలో వైసీపీచే తీవ్ర ఒత్తిడికి గురైన ఉద్యోగ సంఘాలు అనేకం ఉన్నాయి . వీటిలో 'ఆంధ్రప్రదేశ్ పోలీస్ అధికారుల సంఘం' కూడా ఒకటి. ఆ చీకటి కాలంలో తాము ఎదుర్కొన్న అనుభవాలను, వాటి వెనుక ఉన్న నిజాలను ' జర్నలిస్ట్ ఫైల్'తో పంచుకున్నారు ఏపీ పోలీస్ అధికారుల సంఘం సభ్యులు.

**వైసీపీ స్క్రిప్ట్ చదవకపోతే... నరకమే**

2019 సంవత్సరంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన మరుసటి నెలల్లోనే పోలీస్ అధికారుల సంఘం పై వైసీపీ దృష్టి సారించింది. తెలుగుదేశంపై పోలీస్ శాఖను అడ్డుపెట్టుకుని వైసీపీ చేసే దౌర్జన్యాలకు వత్తాసుగా పోలీస్ అధికారుల సంఘాన్ని అడ్డుపెట్టుకోవాలనే వ్యూహరచన చేశారు. అక్కడి నుంచే తమకు కష్టాలు ప్రారంభమైయ్యాయి అంటున్నారు ఆ సంఘం సభ్యులు. 2019 సం.లో టీడీపీ నేత వర్ల రామయ్యకు వ్యతిరేకంగా అసభ్య పదజాలంతో కూడిన ఓ స్టేట్మెంట్ ను వైసీపీ కార్యాలయం నుంచి తెప్పించి మీడియా సమావేశంలో చదవమని పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర కార్యవర్గంపై ఒత్తిడి తీసుకొచ్చారు. అయితే ఆ ఒత్తిడికి



పోలీస్ రాష్ట్ర కార్యవర్గం తల్లొగ్గపోయే సరికి... వైసీపీ వీరాభిమానిగా పేరొంది, టీడీపీ శ్రేణులు, నేతల పట్ల అత్యంత క్రూరంగా వ్యవహరించే పోలీస్ అధికారి జాషువాను రంగంలోకి దిగారు ( ఈ అధికారే అప్పట్లో టీడీపీ నేత పట్టాభి పట్ల అత్యంత అమానుషంగా వ్యవహరించారు ). వైసీపీ కార్యాలయం నుంచి పంపిన స్క్రిప్ట్ ప్రకారం మీడియా సమావేశం నిర్వహించాలని పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర కార్యవర్గాన్ని తీవ్రంగా బెదిరించారు. అయినప్పటికీ వారు అంగీకరించకపోవడంతో... పోలీస్ అధికారుల సంఘం కార్యవర్గంలో సభ్యులు కానటువంటి ప్రసాద్ , రిటైర్డ్ అధికారులైనటువంటి సుబ్రహ్మణ్యం తదితరుల చేత డీజీపీ కార్యాలయం 4 వ అంతస్తులోనే మీడియా సమావేశం నిర్వహించి, వర్ల రామయ్య కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయించారు.

పోలీస్ అధికారుల సంఘంతో సంబంధం లేని వ్యక్తులు... సంఘం పేరుతో డీజీపీ కార్యాలయంలో ఈ మీడియా సమావేశం ఎలా నిర్వహిస్తారని ఆ సంఘం కార్యవర్గ సభ్యులు నిలదీయడంతో ... కక్షగట్టిన వైసీపీ పెద్దలు, అప్పటి పోలీస్ పెద్దలు... పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర కార్యవర్గాన్ని రద్దు చేసి తమకు అనుకూలమైన వ్యక్తులతో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకోవాలని ఓ దశలో ప్రయత్నించారు. ఇందులో భాగంగానే పోలీస్ అధికారుల సంఘం నేతగా నర్రా వెంకటేశ్వర రెడ్డి అనే వ్యక్తిని నియమించేందుకు తోడ్పాటు అందించాలని అప్పటొ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఏకంగా ప్రభుత్వానికి లేఖ రాశారు.

కానీ వైసీపీ పెద్దలు... అప్పటి కార్యవర్గం, అధ్యక్షుడితోనే ఏవిధంగానైనా సరే టీడీపీకి వ్యతిరేకంగా మీడియా సమావేశాలు పెట్టించాల్సిందే అని ఆదేశించడంతో ... అప్పటి డీజీపీ గౌతమ్ సవాంగ్ ... ఆ సంఘం నేతలపై తీవ్రస్థాయిలో బెదిరింపులకు పాల్పడ్డారు. మీపై తీవ్ర చర్యలు ఉంటాయని , మిమ్మల్ని ఆ దేవుడు కూడా కాపాడలేడంటూ తీవ్రంగా హెచ్చరించడంతో వణికిపోయిన ఆ సంఘం కార్యవర్గ సభ్యులు ... టీడీపీ నేత వర్ల రామయ్యకు వ్యతిరేకంగా వైసీపీ కార్యాలయం అందించిన స్క్రిప్ట్ మేరకు మీడియా సమావేశం నిర్వహించేందుకు అంగీకరించారు. ఆ తర్వాత టీడీపీ నేతలకు వ్యతిరేకంగా వైసీపీ నుంచి వస్తున్న స్క్రిప్ట్ ల మేరకు కొన్ని మీడియా సమావేశాలు నిర్వహించారు. ఈ క్రమంలో వర్ల రామయ్య తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ... పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావుపై తాడేపల్లి పోలీస్ స్టేషన్ నందు ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఇది ఇలా ఉండగా మరోసారి వైసీపీ కార్యాలయం నుంచి వర్ల రామయ్యకు వ్యతిరేకంగా మీడియా సమావేశం నిర్వహించాలంటూ మరో స్క్రిప్ట్ వచ్చింది. ఆ స్క్రిప్ట్ లోని పదజాలం చూసి కంగుతిన్న జనకుల శ్రీనివాసరావు ... ఈ విధంగా వర్ల రామయ్యపై వ్యాఖ్యలు నేను చేయలేను అని ఖరాఖండిగా చెప్పారు. దీంతో ఆ సంఘానికి చెందిన విజయవాడ సిటీ అధ్యక్షులు ఎస్సీ వర్గానికి చెందిన సోమయ్యపై ఆ స్క్రిప్ట్ ప్రకారం వర్ల రామయ్యకు వ్యతిరేకంగా మీడియా సమావేశం నిర్వహించాల్సిందిగా ఒత్తిడి తెచ్చారు. ఆయన కూడా అంగీకరించకపోవడంతో అప్పటి డీజీపీ గౌతమ్ సవాంగ్.... అప్పటి విజయవాడ సిటీ పోలీస్ కమిషనర్ గా వ్యవహరించిన ప్రస్తుత డీజీపీ ద్వారకా తిరుమలరావు పిలిపించుకుని తీవ్రస్థాయిలో అసహనం, అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆ సోమయ్యను సైతం అనేక రకాలుగా హింసించినట్లు చెబుతున్నారు.

**స్క్రిప్టే కాదు... హవ భావాలు కూడా చెప్పినట్లు ఉండాల్సిందే...**

వైసీపీ కార్యాలయం నుంచి వచ్చిన స్క్రిప్ట్ ను ఒక్క అక్షరం అటూ, ఇటూ కాకుండా పొల్లుపోకుండా చదవాల్సిందే...

2 లో

# జగన్ గారి.. ఎగ్ పఫ్ బిల్లు జస్ట్ రూ.3.6 కోట్లే !

(మొదటి పేజీ తరువాయి)

వస్తువుల కోసం ఖర్చు చేసినట్లు నివేదిక వెల్లడిస్తోంది. అంటే, ప్రతీ రోజూ ముఖ్యమంత్రి కార్యాలయం సిబ్బంది 993 ఎగ్ పఫ్స్ తినడం జరిగింది, మొత్తంగా 5 ఏళ్లలో 18 లక్షల ఎగ్ పఫ్స్ వినియోగించారు. ఇది ప్రభుత్వ ధనాన్ని పూర్తిగా అన్యాయంగా వాడినట్లే కాదా?

ముఖ్యమంత్రి కార్యాలయ సిబ్బందికి ఎగ్ పఫ్స్ కొనేందుకు ఈటువంటి భారీ ఖర్చు పెట్టినట్లు బయటపడటం షాకింగ్. జగన్ మోహన్ రెడ్డి పంచే లగ్జరీలకు ప్రభుత్వ డబ్బు ఎంతమేరకు వాడి ఉంటారో అనుమానాలు వస్తున్నాయి.

జగన్ ప్రభుత్వ కాలంలో అనేక ఇతర భరతం తప్పిన ఖర్చుల గురించి కూడా ఇప్పటికే బయటపడ్డాయి. వీటిలో అధిక భద్రతా సిబ్బంది నియామకం, రుషికొండలో కోట నిర్మాణం, జగన్ మరియు ఆయన కుటుంబానికి ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్ల వినియోగం వంటి ఖర్చులు ఉన్నాయి.


ఈ 'ఎగ్ పఫ్' కథ నిన్నటికీ మరో వివాదానికి కారణమైంది. సోషల్ మీడియాలో జగన్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు, ప్రజలు సెటైర్లు వేస్తున్నారు. 'ఎగ్ పఫ్' కథ హాట్ టాపిక్ గా మారడంతో 'వెరీ గుడ్డు' జగన్ అన్న అంటూ సోషల్ మీడియాలో ఆయనను ట్రోల్ చేస్తున్నారు.

# వాసుదేవరెడ్డి అరెస్ట్ !? వణికిపోతున్న వైసీపీ

(మొదటి పేజీ తరువాయి)

అవినీతిపై విచారణ జరిపిస్తోంది. ముఖ్యంగా నాసిరకం మద్యాన్ని ఎక్కువరేట్లకు అమ్మడం, అమ్మిన మొత్తాలను జగన్‌కు ఇంటికి చేర్చడంలో వాసుదేవరెడ్డి కీలకపాత్ర పోషించారని, ఇప్పుడు ఆయన దొరకడంతో.. ఈ మొత్తం అవినీతిలో జగన్ వాటా తేలుతుందని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. వాసుదేవరెడ్డి విచారణలో సీఐడీకి సహకరిస్తే ఆయన నోటి ద్వారా అక్రమ మద్యంలో జగన్ కుటుంబ వాటా ఎంతో తేలుతుంది. జగన్‌తోపాటు ఆయన భార్య భారతి కూడా మద్యం కుంభకోణంలో పాత్ర ఉందని, ఆమె కాకుండా వైకాపా ముఖ్యులు సజ్జల రామకృష్ణారెడ్డి, ఆయన కుమారుడు, ఆయన భార్యకు కూడా మద్యం కుంభకోణంలో పాత్ర ఉందనే అనుమానాలు ఉన్నాయి. వాసుదేవరెడ్డి ఇప్పుడు సీఐడీ విచారణలో నోరు విప్పుతారని, తరువాత భారతి, జగన్, సజ్జలకు ఈ కేసులో సీఐడీ నోటీసులు ఇచ్చి ప్రశ్నిస్తుందని, తరువాత ఈ కేసులో వారిని అరెస్టు కూడా చేయవచ్చని ప్రచారం జరుగుతోంది.మొత్తం మీద..మద్యం కుంభకోణంలో కీలక వికెట్టు దొరికిందని, తరువాత దీని వెనుక ఉన్న పెద్దల ముతామొత్తం బయటకు వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత..మెల్లమెల్లగా అవినీతిపరులు, అక్రమార్కులకు ఉచ్చు బిగిస్తోంది. ఏ ఒక్క అవినీతిపరుడినీ, అక్రమార్కులనీ వదిలేది లేదని, చట్టప్రకారం అందరిపై చర్యలు తీసుకుంటామన్న మంత్రి లోకేష్ మాటలు నిదానంగానైనా వాస్తరూపం దాల్చుతున్నాయి.

# హంసలదీవి బీచ్‌లో విషాదం: ఒకరు మృతి, మరొకరు గల్లంతు



**కృష్ణా జిల్లా (జర్నలిస్ట్ ఫైల్) :** కృష్ణా జిల్లా కోడూరు మండలం హంసలదీవి బీచ్‌లో విషాద ఘటన చోటు చేసుకుంది. అలల దాటికి ఒకరు గల్లంతుకాగా, మరో మహిళ ప్రాణాలు కోల్పోయింది. గుడివాడకు చెందిన ఆరుగురు హంసలదీవి బీచ్‌కు వెళ్ళారు. స్నానం కోసం సముద్రంలో దిగగా అలల దాటికి కొట్టుకుపోయారు. వారి అరుపులు విని దగ్గర్లోని ఆటో డ్రైవర్, మైరెన్ పోలీసులు సముద్రంలోకి దిగి ఐదుగురిని రక్షించారు. మరొకరి ఆచూకీ దొరకలేదు. రక్షించిన వారిలో ఓ మహిళ పరిస్థితి విషమంగా ఉండటంతో అవనిగడ్డ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు తెలిపారు. గల్లంతైన వ్యక్తి కోసం మెరైన్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

# తితిదేలో రూ.100 కోట్లు చేతులు మారాయి: చింతా మోహన్



తిరుపతి (జర్నలిస్ట్ ఫైల్) : తితిదేలో 6 నెలల క్రితం రూ. 100 కోట్లు చేతులు మారాయని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఆరోపించారు. గత పాలకమండలి హయాంలో డబ్బులు చేతులు మారాయని తెలిపారు. సత్రాల కోసం రూ. 1200 కోట్లకు ప్రైవేటు సంస్థకు కాంట్రాక్టు ఇచ్చారన్నారు. భక్తుల హుండీ సొమ్మును అపవిత్రం చేశారని.. ఈసొమ్మును ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతిలో గతంలో చోటుచేసుకున్న అగ్నిప్రమాదం ఘటనపై అనుమానాలున్నాయని పేర్కొన్నారు. వరుస ఘటనలపై తితిదే ఈవో విచారణ చేయాలని చింతా మోహన్ డిమాండ్ చేశారు.

# తిరుపతి టీడీఆర్ బాండ్ల స్కాంపై చర్యలు

● సిద్ధమవుతున్న ప్రభుత్వం




తిరుపతి ( జర్నలిస్ట్ ఫైల్ ): అభివృద్ధి పేరుతో తిరుపతి నగరపాలక సంస్థలో గడిచిన మూడు ఏళ్ల కాలంలో చేపట్టిన మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం తీవ్ర అక్రమాలకు నిలయమైంది. మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణాల పేరుతో సేకరించిన భూములకు టీడీఆర్ బాండ్ల రూపంలో చెల్లించిన పరిహారంలో వేల కోట్ల రూపాయలు వైసీపీ నేతల జేబులు నింపాయన్న విమర్శల నేపథ్యంలో కొత్త ప్రభుత్వం విచారణ చేపట్టనుంది. 37 కోట్ల నిధులతో చేపట్టిన 12 రహదారుల సంఖ్యను ఏకంగా 42 కోట్లకు పెంచిన గత పాలకులు భూ సేకరణలో పలు అక్రమాలకు పాల్పడ్డారు.

పట్టణ ప్రణాళిక విభాగం నిబంధనలు గాలికొదిలేసిన వైసీపీ నేతలు ప్రైవేటు వ్యక్తుల భూముల్లో నిర్మాణాలు ప్రారంభించారు. సమగ్ర సర్వే, భూ యజమానులకు తాఖీదులు, పరిహారం, టెండర్లు వంటి వేవీ లేకుండానే రహదారుల నిర్మాణం చేపట్టారు. అడ్డగోలుగా సాగుతున్న మాస్టర్ ప్లాన్ రహదారులపై బాధితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించి తమకు అనుకూలంగా ఉత్తర్వులు తెచ్చుకొన్నా లెక్కచేయకుండా నిర్మాణాలు కొనసాగించారు.

అధికార పార్టీ నేతలతో పొలిటికల్ కమిటీ: టీడీఆర్ బాండ్ల ముసుగులో అక్రమాలకు తెరతీసిన గత పాలకులు తమకు వంతపాడే అధికారులను పట్టణ ప్రణాళిక విభాగంలో ఖాళీ అయిన కీలక పోస్టుల్లో నియమించుకొన్నారు. స్థాయి లేకున్నా పదిమంది నాలుగో తరగతి ఉద్యోగులను ప్రణాళికాధికారులుగా నియమించారు. గెజిటెడ్ హొదా కలిగిన ప్రణాళికాధికారుల విధులతో పాటు పూర్తి అధికారాలు కట్టబెట్టారు. నగరపాలక వ్యవస్థకు సమాంతరంగా ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నేతలతో కూడిన మాస్టర్ ప్లాన్ రోడ్ల పొలిటికల్ కమిటీని ఏర్పాటు చేశారు. అనధికారికంగా ఏర్పాటైన ఈ కమిటీ కనుసన్నల్లో రోడ్ల నిర్మాణం, టీడీఆర్ బాండ్ల జారీ వాటి విక్రయాలు సాగాయి. పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల రీతిలో పొలిటికల్ కమిటీ గుత్తేదారులతో కలిసి వెళ్లి అర్ధరాత్రిళ్లు రోడ్డు విస్తరణకు భవనాలు కూల్చడం, ఎదురు తిరిగితే బెదిరించడం, మధ్యవర్తులుగా వ్యవహరించి భూములు, భవనాలు స్వాధీనం చేసుకొన్నారన్న విమర్శలు ఉన్నాయి. సమాచారం లేకుండా భూ సేకరణ: గొల్లవానిగుంట, కొర్లగుంట రోడ్లతో పాటు నగరపాలక సంస్థ ఆమోదం పొందిన 17 మాస్టర్‌ప్లాన్ రోడ్లకు పదకొండు వందల 21 మంది నుంచి భూములు సేకరించారు. వార్డు సచివాలయాల్లో నోటిఫికేషన్ ప్రదర్శించిన అధికారులు యజమానులకు సమాచారం లేకుండా భూ సేకరణ ప్రక్రియ పూర్తి చేశారు. నగరపాలిక అధికారులు స్వాధీనం చేసుకున్న భూముల్లో ఇప్పటి వరకు 200 మందికి నోటీసులు కూడా ఇవ్వలేదు. 400 మందితో ఎలాంటి ఒప్పందాలు చేసుకోలేదు. నిర్మాణాలు చేపట్టిన రహదారులకు సంబంధించి టీడీఆర్ బాండ్ల జారీతో అధికార పార్టీ నేతలు కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడ్డారన్న విమర్శలు ఉన్నాయి. టీడీఆర్ బాండ్ల జారీలో భారీ అక్రమాలు చోటు చేసుకొన్నాయని విచారణ నిర్వహించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి రవినాయుడు ముఖ్యమంత్రితో పాటు పురపాలక శాఖ మంత్రికి ఫిర్యాదు చేశారు.

విచారణకు ప్రభుత్వం ఆదేశం: ముఖ్యమంత్రి, పురపాలక శాఖ మంత్రికి ఫిర్యాదు చేయడంతో టీడీఆర్ బాండ్ల అక్రమాలపై చర్యలు ప్రారంభమయ్యాయి. విచారణకు ముందుగా అర్హత లేకున్నా పట్టణ ప్రణాళిక విభాగంలో విధులు నిర్వహిస్తున్న వారిపై చర్యలు చేపట్టారు. రాజంపేట నుంచి డిప్యుటేషన్‌పై పట్టణ ప్రణాళిక విభాగంలో ప్లానింగ్ అసిస్టెంట్ కమిషనర్గా బాధ్యతలు అప్పగించిన అధికారి బాలసుబ్రమణ్యంను పూర్వస్థానానికి బదిలీ చేశారు. పూర్తి స్థాయి విచారణకు విజిలెన్స్ లేదా సీఐడీ విచారణకు ప్రభుత్వం ఆదేశించనుంది.

# పోలీస్ అధికారుల సంఘంతో 'వైసీపీ బంతాట'

(మొదటి పేజీ తరువాయి)

అంతేకాకుండా మీడియా సమావేశంలో హవా భావాలు, బాడీ లాంగ్వేజ్ ఎలా ఉండాలి అనేది కూడా వైసీపీ కార్యాలయం నుంచే డైరెక్షన్ వస్తుంది. వీటిలో ఏది పాటించకపోయినా పోలీస్ అధికారుల సంఘం నేతలకు పై నుంచి తీవ్రంగా దూషణలు, హెచ్చరికలు వచ్చేవి. ఓసారి అప్పటి ప్రతిపక్ష నేతగా వ్యవహరించిన చంద్రబాబు నాయుడుకు వ్యతిరేకంగా మీడియా సమావేశం నిర్వహించమని వైసీపీ కార్యాలయం నుంచి పోలీస్ అధికారుల సంఘానికి వైసీపీ నుంచి స్క్రిప్ట్ వచ్చింది. ఆ స్క్రిప్ట్ నందు తీవ్రమైన అసభ్య పదజాలం, అభ్యంతరకర వ్యాఖ్యలు ఉండడంతో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు మీడియా సమావేశం నిర్వహించేందుకు అంగీకరించలేదు. వెంటనే రంగంలోకి దిగిన డీజీపీ గౌతమ్ సవాంగ్, జాషువా తీవ్రస్థాయిలో బెదిరింపులకు పాల్పడంతో భయపడిపోయిన జనకుల శ్రీనివాసరావు విధిలేని పరిస్థితిలో మీడియా సమావేశం నిర్వహించారు. అయితే వైసీపీ పంపిన స్క్రిప్ట్ నందు పేర్కొన్న విధంగా చంద్రబాబుపై అసభ్య దూషణలు చేయకుండా... సంస్కారవంతమైన రీతిలో చంద్రబాబుపై విమర్శలు చేశారు. దీనికే వైసీపీ పెద్దలు పెద్దలు ఆగ్రహం తో ఊగిపోయారు. వెంటనే అనంతపురం- కర్నూలు బోర్డరులోని పోతుదొడ్డి అనే ప్రాంతానికి డ్యూటీపై పంపి వేధింపులకు పాల్పడ్డారు. సాధారణంగా పోలీస్ అధికారుల సంఘం కార్యవర్గానికి ఓడి సౌకర్యం ఉంటుంది. వీరికి డ్యూటీలు వేయడం చాలా అరుదు. వైసీపీ వేధింపులు ఏ స్థాయిలో ఉంటాయనడానికి ఇదో ఉదాహరణ.

**అభిమానులనే ఉసిగొల్పుతూ... రాక్షసానందం**

2019 అధికారంలోకి వచ్చిన అనంతరం వైసీపీ వ్యవహారశైలిని గమనిస్తే... ఆ పార్టీలో ఓ సైకో శైలి కనిపిస్తోంది. టీడీపీకి ఎవరైతే అభిమానులుగా ఉంటారో... వారిపై తీవ్ర వేధింపులకు పాల్పడి వారితోనే టీడీపీ నేతలకు వ్యతిరేకంగా వ్యవహరించేలా చేశారు. అభిమానులతోనే దూషణలు చేయిస్తూ రాక్షసానందం పొందేవారు. ఇలాంటి బాధితుల్లో ఒక్కరే... పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు. స్వతహాగా ఆయన టీడీపీ అభిమాని. 2019 ఎన్నికల సమయం నుంచే జనకుల శ్రీనివాసరావు వైసీపీకి టార్గెట్ గా ఉన్నారు. ఆ ఎన్నికల సమయంలో ఆయన టీడీపీకి అనుకూలంగా ప్రచారం చేస్తున్నారంటూ వైసీపీ గగ్గోలు పెట్టింది. ఆయనపై ఫిర్యాధులు కూడా చేసింది. అప్పట్లో సాక్షి దినపత్రికలో ఆయనపై వార్తలు కూడా ప్రచురించింది. ఇక వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయనను టార్గెట్ చేసింది. ఆయన ద్వారా టీడీపీకి వ్యతిరేకంగా మీడియా సమావేశాలు నిర్వహించేలా తీవ్ర వేధింపులకు గురి చేసింది. ఈ ఒత్తిడిని భరించలేని జనకుల శ్రీనివాస రావు... తాను సంఘ అధ్యక్షుడిగా రాజీనామా చేస్తానని, అప్పట్లో డీజీపీ ముందు రాజీనామా లేఖ ఉంచారు. ఆ మరుసటి రోజు సాయంత్రం... డీజీపీ ఆయనను పిలిపించి.. నువ్వు అధ్యక్ష పదవికి రాజీనామా చేయడానికి వీల్లేదని, నువ్వే అధ్యక్షుడిగా ఉండాలి... నువ్వే టీడీపీ నేతలపై విమర్శలు చేయాలని , లేదంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని వైసీపీ పెద్దల మాటగా చెప్పమన్నారంటూ హెచ్చరించారు. కేవలం టీడీపీ అభిమానైన ఆయన ద్వారానే టీడీపీ నేతలపై విమర్శలు చేయించాలనే వికృత మనస్తత్వమే ఇందుకు కారణం. ఇక జనకుల శ్రీనివాసరావు టీడీపీ వీరభిమానిగా గతంలో చేసిన సేవలే... గత వైసీపీ ప్రభుత్వంలో ఆయన కష్టాలకు కారణమయ్యాయి . టీడీపీ ఆవిర్భవించిన 1983 వ సంవత్సరంలో ఆయన పదో తరగతి చదువుతున్నారు. అప్పట్లోనే ఆయన టీడీపీకి అనుకూలంగా ... " కలబొల్లి కథలు చెప్పి... నంగనాచి మాటల్లాడి... పేదోళ్ళ అమ్మనంటివే... ఓ ఇందిరమ్మ ... గంజి నీళ్లు దొరక్కవాయనే ఓ ఇందిరమ్మ..." గేయాన్ని రచించడమే కాకుండా 72 రోజుల పాటు ఉరూరా తిరిగి... స్వయంగా పాడుతూ ప్రచారం నిర్వహించారు. ఎన్ని ఇబ్బందులైనా ఆ నాటి నుంచి నేటి వరకు నలబై సంవత్సరాలకు పైగా టీడీపీతో అయన అనుబంధం కొనసాగుతూనే ఉంది. అయితే గడిచిన ఐదేళ్లు మాత్రం తనకో పీడకల అంటారు. తనను పైకి చెప్పుకోలేని చిత్రవధ విధంగా చేసి... తన చేతనే టీడీపీపై విమర్శలు చేయించేందుకు తీవ్రంగా వేధించారు అని మధనపడుతున్నారు.

# మల్లన్న భక్తులకు గుడ్ న్యూస్.. అధికారుల కీలక ప్రకటన



శ్రీశైలం ( జర్నలిస్ట్ ఫైల్ ) : శ్రీశైలం మహాక్షేత్రంలో ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు మల్లన్న స్పర్శ దర్శనాలను నిలుపుదల చేస్తూ భక్తులందరికీ స్వామివారి అలంకార దర్శనాన్ని మాత్రమే కల్పించాలని అధికారులు నిర్ణయించారు. భక్తుల కోరిక మేరకు ఈ నెల 18, 19 తేదీలో స్వామివారి స్పర్శ దర్శనాన్ని కల్పించేందకు అధికారులు నిర్ణయించారు. ఈ రెండు రోజులు నిర్దిష్ట సమయాలలో నాలుగు విడతలుగా స్వామివారి స్పర్శ దర్శనం కల్పించనున్నారు.

మొదటి విడత 6:45 నుంచి 8:30 వరకు, రెండవ విడత మధ్యాహ్నం 12 నుంచి 1:30 వరకు, మూడో విడత రాత్రి 8 నుంచి 9 వరకు, నాలుగో విడత రాత్రి 10 నుంచి 11:30 గంటల వరకు స్వామివారి స్పర్శ దర్శనం కల్పించనున్నారు. భక్తులు స్పర్శ దర్శనం టిక్కెట్లను ఆన్‌లైన్ వెబ్‌సైట్ https://www.srisailadevasthanam.org ద్వారా గంట ముందు వరకు కూడా పొందవచ్చు. అయితే ఈ రెండు రోజులు స్వామివారి గర్భాలయ, సామూహిక ఆర్జిత అభిషేకాలు, ఆర్జిత కుంకుమార్చనలకు అవకాశం లేదు.

**నిలకడగా ఇన్ ఫ్లో..**

ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైల జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి జూరాల నుంచి 31,806 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 60,354 క్యూసెక్కులు మొత్తం 1,39,796 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 881.10 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 193.8593 టీఎంసీలుగా నమోదయింది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 31,303 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,681 క్యూసెక్కుల మొత్తం 68,984 క్యూసెక్కుల నీటిని విద్యుత్ ఉత్పత్తి చేస్తూ దిగువ నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

# 48 గంటల్లో నెరవేరిన చంద్రబాబు హామీ

(మొదటి పేజీ తరువాయి)

అలా సీఎం హామీ ఇచ్చారో లేదో ఆగస్టు 17 కల్లా రజనీకాంత్ ఇంటి ముందు ఎలక్ట్రిక్ ఆటో ప్రత్యక్షమైంది. సీఎం హామీ అమలుపై కలెక్టర్ డీకే బాలాజీ ఆగమేఘాలపై కదిలారు. 3.90 లక్షలు విలువైన "అవే ఈసిటీ "ఎలక్ట్రిక్ ఆటో తెప్పించారు. గుడివాడ మున్సిపల్ కమిషనర్ బాలసుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ద్వారా రజినీకాంత్‌కు ఆటో తాళాలు అందజేశారు.

ఎలక్ట్రిక్ ఆటోను చూసి రజనీకాంత్ మురిసిపోయారు. చంద్రబాబు పాలనా వేగం గురించి అందరూ చెప్తుంటే విన్నానని, తాను స్వయంగా చూశానని సంబరపడుతున్నారు. సీఎం చేసిన మేలును తమ కుటుంబం ఎప్పుడూ మరచిపోదని రజనీకాంత్ చెప్పారు.

నేను డీజిల్ ఆటోను తోలే వాడిని. సీఎం చంద్రబాబు మొన్న వచ్చినప్పుడు డీసీల్ ఆటోను ఎలక్ట్రిక్ ఆటోగా మార్చే పద్ధతి గురించి నన్ను అడిగాడు. దానిపై నాకు ఎలాంటి అవగాహన లేదు. కలెక్టర్ను పిలిచి అడిగితే.. అది మన రాష్ట్రంలో లేదని చెప్పారు. డీజిల్ ఆటో బదులు ఎలక్ట్రిక్ ఆటో ఇవ్వడానికి ప్రధాన కారణం.. డీసీల్ ఖర్చును తగ్గించుకోవడానికి. ఇందుకు నెలకు రూ.4000 నుంచి రూ.5000 వరకు మెయింటన్స్ ఖర్చు వస్తుంది. నేను మామూలుగా ఫీల్ అవ్వడం లేదు. రాష్ట్రంలో ఎవరికీ దక్కని అదృష్టం నాకు దక్కింది –రజనీకాంత్ , ఆటో డ్రైవర్

# మమతా బెనర్జీపై విశ్వాసం పోయింది

● అది ఆత్మహత్య కాదని ముందే చెప్పా

● కోల్ కతా వైద్యురాలి తల్లి

పొలిటికల్ డెస్క్ (జర్నలిస్ట్ ఫైల్): కోల్ కతా లోని ఆర్జీకార్ మెడికల్ కళాశాలలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ఘటనపై బాధితురాలి తల్లిదండ్రులు తాజాగా మీడియాతో మాట్లాడారు. ఈ సంఘటనలో చాలా మంది వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. ఆ రోజు సంఘటనను గుర్తుతెచ్చుకొని బాధితురాలి తల్లి కన్నీటిపర్యంత మయ్యారు. "మీ కూతురికి ఆరోగ్యం బాగలేదని శుక్రవారం ఉదయం 10:53 గంటలకు ఆసుపత్రి వాళ్లు ఫోన్ చేసి కాల్ కట్ చేశారు. తర్వాత ఫోన్ చేసి ఏం జరిగిందో చెప్పండి అని ప్రశ్నిస్తే.. ఆసుపత్రికి రమ్మన్నారు. మీ కూతురు ఆత్మహత్య చేసుకుందని అక్కడున్న ఓ అసిస్టెంట్ మాతో చెప్పింది. విషయం తెలిసిన వెంటనే మేము అక్కడకు వెళ్లాం. మమ్మల్ని హాలులోకి వెళ్లేందుకు అనుమతించలేదు. తీరా 3గంటలకు లోనికి పంపారు. నా కుమార్తెను చూసి కుంగిపోయా. కేవలం ఒక్క చిన్న వస్త్రం మాత్రమే తన శరీరంపై ఉంది. చేతులు విరిగిపోయాయి. కళ్లు, నోటి నుంచి రక్తం వస్తోంది. నా కూతురిని చూడగానే ఎవరో హత్య చేసినట్లు అనిపించింది. నా కుమార్తె ఆత్మహత్య చేసుకోలేదు ఎవరో చంపేశారు అని అక్కడున్న వారితో అప్పుడే చెప్పా. నా కూతురును డాక్టర్ను చేయడానికి ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నాం. చివరికి ఆమెను ఇలా హత్య చేశారు" అని ఆమె మీడియాతో తన బాధను పంచుకున్నారు.

**మమతా బెనర్జీపై విశ్వాసం పోయింది**

తమ కుమార్తె విషయంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని, దీంతో సీఎం మమతా బెనర్జీపై విశ్వాసం పోయిందని బాధితురాలి తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. మీడియాతో మాట్లాడిన ఆయన.. ఇంతకు ముందు బెంగాల్ ముఖ్యమంత్రిపై పూర్తి విశ్వాసం ఉండేదని కానీ ఇప్పుడు లేదన్నారు. న్యాయం జరగాలని మమతా చెబుతోంది.. కానీ దాని కోసం ఆమె ఎటువంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. తన కుమార్తె డైరీలోని ఒక పేజీని సీబీఐకి అందజేసినట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. నిందితులను వీలైనంత త్వరగా అరెస్టు చేస్తామని మమతా బెనర్జీ చెప్పారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసులో తాజాగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారాన్ని సుప్రీం కోర్టు సుమోటోగా స్వీకరించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆగస్టు 20న ఈ కేసును విచారించనుంది.

# పోలవరం దస్త్రాల దహనం.. బాధ్యులపై కఠిన చర్యలకు వెనుకాడబోం: మంత్రి దుర్గేశ్



రాజమహేంద్రవరం (జర్నలిస్ట్ ఫైల్) : పోలవరం దస్త్రాల దహనం ఘటనలో బాధ్యులపై కఠిన చర్యలకు వెనుకాడబోమని మంత్రి కందుల దుర్గేశ్ హెచ్చరించారు. పోలవరం ప్రాజెక్టు కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. తగలబడిన దస్త్రాలను పరిశీలించడంతో పాటు నిర్లక్ష్యంగా ఉన్న సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దహనమైన వాటిని రాజమహేంద్రవరం ఆర్డీవో శివజ్యోతి జిరాక్స్ పేపర్లుగా ప్రకటించడంపై అసహనం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి ఆనవాళ్లను మాయం చేస్తున్నారని విమర్శించారు. బాధ్యులైన సిబ్బందిని రక్షించవద్దని జేసీ చెన్నరాయుడికి సూచించారు. పూర్తిస్థాయి విచారణ చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు.

# ఏపీ ప్రజలకు కేంద్రం బంపరాఫర్



(జర్నలిస్ట్ ఫైల్) ఏపీ ప్రజలకు కేంద్రం బంపరాఫర్ ప్రకటించింది. త్వరలో సీ ప్లేన్స్ తీసుకొచ్చేందుకు ఏపీ ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ విషయాన్ని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్వయంగా వెల్లడించారు. వచ్చే వారం రోజుల్లో సీ ప్లేన్స్ విధానాన్ని విడుదల చేస్తామని తెలిపారు. ఏపీలో తీర ప్రాంతం అధికంగా ఉన్న నేపథ్యంలో పర్యాటకంగా ఈ సీ ప్లేన్స్‌ను ఉపయోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

# కోల్‌కతా హత్యాచార కేసు.. సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు

**ఢిల్లీ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా వైద్య విద్యార్థిని హత్యాచార కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారాన్ని సుప్రీం కోర్టు సుమోటోగా స్వీకరించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆగస్టు 20న ఈ కేసును విచారించనుంది. కోల్కతాలోని ఆర్జీ కర్ ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటన కేసును సుమోటోగా స్వీకరించాలని కోరుతూ ఇద్దరు న్యాయవాదులు భారత ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. ఈ క్రమంలోనే కేసు విచారణ చేపట్టనున్నట్లు సుప్రీం వెబ్సైట్లో పొందుపరిచింది. ఈ కేసును కలకత్తా హైకోర్టు ఇప్పటికే సీబీఐకి బదిలీ చేసిన విషయం తెలిసిందే. దీంతో రంగంలోకి దిగిన కేంద్ర దర్యాప్తు సంస్థ.. విచారణను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ప్రధాన నిందితుడికి మానసిక సామర్థ్య పరీక్షలు నిర్వహించనుంది.




ఈనెల 9న కోల్‌కతాలోని ఆర్. జీ కర్ ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనపై దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్న వేళ సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటోగా స్వీకరించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**అప్రమత్తమైన బెంగాల్ పోలీసులు**

కోల్‌కతా హత్యాచార ఘటనపై పెద్దఎత్తున ఆందోళనలు జరుగుతుండటంపై బెంగాల్ పోలీసులు అప్రమత్తమయ్యారు. సామాజిక మాధ్యమాల్లో అసత్యాలు ప్రచారం కావటమే ఆందోళనలకు కారణమని భావిస్తున్న పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. ఈ నేపథ్యంలో బీజేపీ నాయకురాలు, మాజీ ఎంపీ లాకెట్ ఛటర్జీతోపాటు ఇద్దరు వైద్యులు కునాల్ సర్కార్, సుబర్ణోగోస్వామికి సమన్లు జారీ చేశారు. విచారణకు హాజరుకావాలని సూచించారు.

అనేక ఛానళ్లకు ఇంటర్వ్యూలు ఇచ్చిన డాక్టర్ గోస్వామి పోస్టుమార్టం నివేదికను చూసినట్లు చెప్పారు. అందులో విస్తుపోయే నిజాలు ఉన్నాయని తెలిపారు. మృతురాలి శరీరంలో 150 మిల్లీగ్రాముల వీర్యంతోపాటు కటి ఎముక విరిగినట్లు పోస్టుమార్టం నివేదికలో ఉందన్నారు. పోస్టుమార్టం నివేదిక ప్రకారం ముమ్మాటికి మృతురాలిపై సామూహిక అత్యాచారం జరిగి ఉంటుందని డాక్టర్ గోస్వామి తెలిపారు. ఈ విషయాలను కోల్‌కతా పోలీసులు తోసిపుచ్చారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దిన పత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి
జన్మదిన శుభాకాంక్షలు, పొలిటికల్, స్వదేశాగమనం, లీగల్ ప్రకటనలు, క్లాసిఫైడ్స్
పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, సినిమా, వివాహ మహోత్సవం,
షష్టిపూర్తి మహోత్సవం మరియు అన్ని శుభకార్యాలు
ప్రకటనల విభాగం
76 61 80 59 68

# భద్ర నీడలో రక్షాబంధన్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఈ ఏడాది రాఖీ పౌర్ణమి భద్ర నీడతో ప్రారంభం అవుతుంది. అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న బంధానికి గుర్తుగా రాఖీ పండుగ జరుపుకుంటారు. అయితే రాఖీ కట్టేందుకు ఏది ఉత్తమమైన సమయమో పండితులు తెలియజేశారు. శ్రావణ మాసంలో వచ్చే పౌర్ణమి రోజు రక్షాబంధన్ పండుగను జరుపుకుంటారు. ఈ రోజున సోదరీమణులు తమ సోదరుడి మణికట్టుపై రక్షాసూత్రాన్ని కడతారు. అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న శాశ్వతమైన బంధానికి ఇది ప్రతీకగా నిలుస్తుంది. అయితే ఈసారి రక్షాబంధన్ రోజున భద్ర ఛాయ ఉంటుంది. అటువంటి పరిస్థితిలో రక్షాసూత్రం కట్టడానికి సమయం ప్రాముఖ్యత చాలా పెరుగుతుంది. జ్యోతిషశాస్త్రం ప్రకారం ఆగష్టు 19 న రక్షాబంధన్ నాడు రాఖీ కట్టడానికి చాలా శుభ ముహూర్తాలు ఉన్నాయి.

**రాఖీ పండుగ ఎప్పుడు?**

ఆగస్ట్ 19న పూర్ణిమ తిథి తెల్లవారుజామున 03:04 బ్రహ్మముహూర్తం నుంచి ప్రారంభమై రాత్రి 11:55 వం-కు ఉంటుందని పండితులు తెలిపారు. పౌర్ణమి ప్రారంభంతో భద్ర కాలం ప్రారంభమవుతుంది. కొన్ని పంచాంగాల ప్రకారం భద్ర ఉదయం 05:53 నుండి ప్రారంభమై మధ్యాహ్నం 01:32 వరకు ఉంటుంది. భద్రాకాలం ముగిసిన తర్వాత సోదరీమణులు రక్షాసూత్రాన్ని సోదరుని మణికట్టుపై కట్టవచ్చు.

**శుభ యోగాలు**

రాఖీ పండుగ రోజు మధ్యాహ్నం 01:33 నుండి రాత్రి 10:00 గంటల వరకు కట్టవచ్చు. రక్షాబంధన్ నాడు మూడు శుభ యోగాలు కూడా ఉన్నాయి. వీటిలో శోభన్ యోగం రోజంతా ఉంటుంది. ఉదయం 5:53 నుండి 8:10 వరకు రవియోగం, సర్వార్థ సిద్ధి యోగం ఉన్నాయి. ఈ కాలంలో నిత్యపూజలు మొదలైనవి చేయవచ్చు.

ఆగస్ట్ 19 తెల్లవారుజామున 3:07 నుండి పౌర్ణమి ప్రారంభమవుతుంది. దానితో పాటు భద్ర కూడా ఉంటుంది. ఇది మధ్యాహ్నం 01:34 వరకు ఉంటుంది. రక్షాబంధన్ సమయంలో భద్రుని నీడ ఉంటే రాఖీ కట్టడం సరికాదు. కావున రక్షాసూత్రము భద్రము ముగిసిన తరువాత ఉంటుంది. రెండు శుభ ముహూర్తాలు కూడా ఉన్నాయి. ఇందులో చర యోగం మధ్యాహ్నం 02:00 నుండి 03:40 వరకు ఉంటుంది. లాభామృత ముహూర్తం మధ్యాహ్నం 03:40 నుండి సాయంత్రం 06:56 వరకు ఉంటుంది. ఇది చాలా శుభప్రదమైన క్షణం.

**భద్ర నీడలో ఎందుకు కట్టకూడదు?**

పురాణాల ప్రకారం భద్ర సమయంలో శూర్పణఖ తన అన్న రావణుడికి రాఖీ కట్టింది. అందువల్ల రావణుడి వంశం నిర్వీర్యమైంది. అందుకే భద్ర సమయంలో రాఖీ కట్టడం శ్రేయస్కరం కాదని అంటారు. అది మాత్రమే కాదు ఈ సమయంలో శివుడు ఉగ్రరూపుడై తాండవం ఆడతారని అంటారు. ఈ సమయంలో చేసే ఏ శుభ కార్యమైన చెడు ఫలితాలు ఇస్తుందని నమ్ముతారు. భద్ర సూర్య భగవానుడి కుమార్తె శని సోదరి. బ్రహ్మ దేవుడు ఆమెకు కాలంలో ఒక నిర్దిష్ట సమయాన్ని ఇచ్చాడు. అదే భద్ర కాలం. ఇది అశుభమైనదిగా పిలుస్తారు.

**పూజ సామగ్రి జాబితా**

రక్షా బంధన్ రోజు సోదరుడికి రాఖీ కట్టేందుకు ముందుగానే తాలీ సిద్ధం చేసి పెట్టుకోవాలి. అందుకు కావాల్సిన పూజా సామాగ్రి జాబితా ఇది. ఇందులో అక్షతలు, రాఖీ, స్వీట్లు, కుంకుమ, హారతి ఇచ్చేందుకు కర్పూరం వంటివి తప్పనిసరిగా ఉండాలి.

రక్షాబంధన్ పండుగలో రాఖీ అత్యంత ముఖ్యమైనది. పూజ తాలీలో రాఖీ ఉండటం చాలా ముఖ్యం. రక్షాబంధన్ రోజున సోదరీమణులు మొదట సోదరుడి నుదిటిపై తిలకం వేస్తారు. అందుకోసం కుంకుమ ఉండాలి. హిందూ మతంలో ఏదైనా శుభకార్యానికి ముందు తిలకం పెట్టే సంప్రదాయం ఉంది. తిలకం పూసిన తర్వాత నుదుటిపై కూడా బియ్యం పెడతారు. దీనిని అక్షత్ అని కూడా అంటారు. రక్షాబంధన్ రోజున పూజ పళ్ళెంలో బియ్యం ఉంచండి. రక్షాబంధన్ రోజున సోదరీమణులు కూడా తమ సోదరుడికి హారతి చేస్తారు. హారతి చేయడానికి దీపం అవసరం, అందుకే దీపాన్ని పూజ తాలీలో ఉంచండి. రాఖీ కట్టిన అనంతరం సోదరీమణులు తమ సోదరులకు స్వీట్లు తినిపిస్తారు. పూజ తాలీలో స్వీట్లు ఉంచండి. సోదరీమణులు తమ సోదరుడికి రాఖీ కట్టేటప్పుడు ఈ మంత్రాన్ని పఠించాలి.

"ఓం యేన బద్ధో బలి రాజా దానవేంద్రో మహాబల: పది త్వమభి బధ్నామి రక్షే మా చల్ మా చల్". ఈ మంత్రాన్ని పఠిస్తూ రాఖీ కట్టాలి.

## ఏపీలో రెండు రోజులు అతి భారీ వర్షాలు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** తెలుగు రాష్ట్రాలకు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో రాబోయే రెండు రోజులపాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు, మరికొన్ని జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని ఐఎండి తెలిపింది. రాబోయే రెండు రోజుల్లో విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, ఉభయగోదావరి, ప్రకాశం, నంద్యాల జిల్లాల్లో భారీ వర్షాలు, కృష్ణా, గుంటూరు, సత్యసాయి, కర్నూలు, కడప, చిత్తూరు, పల్నాడు జిల్లాల్లో మోస్తారు వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ శాఖ వెల్లడించింది. గడచిన 24 గంటల్లో రాయలసీమలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయి. సత్యసాయి జిల్లాలో గరిష్ఠంగా 6 సెం.మీ వర్షపాతం నమోదైంది. ద్రోణి, ఆవర్తనం ప్రభావంతో తెలంగాణలోని 13 జిల్లాల్లో అతి భారీ వర్షాలు నమోదవుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. అక్కడక్కడా పిడుగులు కూడా పడే ప్రమాదముందని ఐఎండి హెచ్చరికలు జారీ చేసింది.

## తిరుమల పరిపాలనా భవనంలో అగ్ని ప్రమాదం



**తిరుమల (జర్నలిస్ట్ ఫైల్) :** తిరుమల పరిపాలనా భవనంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పలు కీలక ఫైళ్లు దగ్ధం అయ్యాయి. దేవాలయాల పునరుద్ధరణ, రోడ్ల నిర్మాణానికి సంబంధించిన అవినీతిని కప్పి పుచ్చేందుకే కొందరు అధికారులు ఫైళ్లు దహనం చేశారనే అనుమానాలొస్తున్నాయి. తిరుమలలో గత ఐదు సంవత్సారాలుగా జరిగిన పనులపై విచారణ సాగుతోంది. ఇందులో భాగంగా ఇటీవల విజిలెన్స్ విభాగం పరిపాలనా శాఖలో పనిచేసే డిప్యూటీ ఇంజనీరుకు నోటీసులు జారీ చేశారు. ఆ వెంటనే కార్యాలయంలో కీలక దస్త్రాలు కాలిపోవడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తిరుమలలోని పరిపాలనా భవనం మొదటి అంతస్తు ఐదో గదిలో డీఈ కార్యాలయం పనిచేస్తోంది. ఇక్కడ పలు దేవాలయాల నిర్మాణం, రోడ్ల నిర్మాణాలకు సంబంధించిన దస్త్రాలు ఉన్నాయి. దాదాపు ఐదేళ్లలో రూ.300 కోట్లు ఖర్చు చేశారు. వీటి లెక్కల్లో తీవ్ర అవినీతి చోటు చేసుకుందనే విమర్శలు వస్తున్నాయి. అవినీతి వెలుగులోకి రాకుండా ఉండేందుకే దస్త్రాలు కావాలనే దహనం చేశారనే కోణంలో విజిలెన్స్ విచారణ జరుపుతోంది. కొన్ని దస్త్రాలు ఆన్‌లైన్ చేసినా, ఆ డేటా కూడా డిలీట్ చేశారని తెలుస్తోంది. తిరుమల కార్యాలయం దహనంపై సీఎం చంద్రబాబునాయుడు ఆరా తీశారు. విచారణకు ఆదేశించారు.

## ఆలయంలో శ్రావణమాస పూజలు.. ఒక్కసారిగా అలజడి.

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** శ్రీరాముని ఆలయం.. భక్తులంతా శ్రావణమాస పూజల్లో నిమగ్నమయ్యారు. పూజారి కూడా సీతారాములకు పూజలు చేస్తూ ఉన్నారు. ఇంతలో ఒక్కసారిగా అలజడి. అందరూ ఉరుకులు.. పరుగులు తీశారు. హడావుడి మొదలైంది. కట్ చేస్తే.. అసలు విషయం తెలిసి, పూజారి సైతం పరుగు అందుకున్నారు. తీరా చూస్తే, నాగు పాము కలకలం రేపింది. భుసలు కొడుతూ హడలెత్తించింది. విశాఖ మల్కాపురం శ్రీరాముని ఆలయంలో భక్తుల హడావుడితో పడగ విప్పి హల్చల్ చేసింది ఆరడుగుల నాగు పాము. దీంతో భక్తులు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న స్నేక్ క్యాచర్ నాగరాజు.. చాకచక్యంగా పామును బంధించి, నగర శివారు లో విడిచి పెట్టారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## అమరావతికి రూ.15వేల కోట్ల రుణసాయం అందించేందుకు ప్రపంచ బ్యాంకు ఓకే!

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్ర బడ్జెట్లో ప్రతిపాదించిన మేరకు ఏపీ రాజధాని అమరావతికి రూ. 15 వేల కోట్ల రుణసాయం అందించేందుకు ప్రపంచ బ్యాంకు హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆసియా డెవలప్మెంట్ బ్యాంక్ తో కలిసి ఆ మొత్తాన్ని మంజూరు చేయనున్నట్లు సమాచారం. ఆయా బ్యాంకుల ప్రతినిధులు రేపటి నుంచి ఈ నెల 27 వరకు రాజధానిలో పర్యటించి వివిధ అంశాలపై ప్రభుత్వంతో చర్చించనున్నారు. వీలైనంత త్వరలోనే రుణం మంజూరు చేసే అవకాశముంది.

## తుంగా తీరంలో శ్రీరాఘవేంద్రుల 353వ సప్తరాత్రోత్సవాలు



**కర్నూలు జిల్లా (జర్నలిస్ట్ ఫైల్) :** వేదభూమి మంత్రాలయంలో శ్రీరాఘవేంద్ర స్వామి 353వ ఆరాధన సప్తరాత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆశీస్సులతో ఏడు రోజుల పాటు ఈ ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. సప్తరాత్రోత్సవాల సందర్భంగా ప్రతీ రోజూ రాయరు రథోత్సవాలతోపాటు రాములోరి సంస్థాన పూజలు ఉంటాయి. భక్తుల కోసం యోగీంద్ర మంటపంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. నేడు ధ్వజారోహణ, ధాన్యపూజ, గోవు, తురగ పూజ నిర్వహిస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు నేడు పట్టువస్త్రాల సమర్పించనున్నారు. సోమవారం నాడు శాఖోత్సవం నిర్వహించి రజత మంటపోత్సవం చేపడతారు. ఉత్సవాల్లో మూడోరోజున అంటే మంగళవారం పూర్వారాధన సందర్భంగా సింహవాహనంపై ప్రహ్లాదరాయల ఊరేగింపు నిర్వహిస్తారు. బుధవారం మధ్యారాధన పురస్కరించుకుని రాఘవేంద్రుల మూల బృందావనానికి మహా పంచామృతాభిషేకం చేస్తారు. రాత్రి గజవాహనోత్సవంతోపాటు రజత, సువర్ణ రథోత్సవాలు ఉంటాయి. మహా రథోత్సవం, వసంతోత్సవం భక్తశ్రద్ధలతో నిర్వహిస్తారు. గురువారం నాడు రాఘవేంద్రుల మహా రథోత్సవం అంగరంగ వైభవంగా చేపడతారు. హెలికాప్టర్‌తో పూలు చల్లుతారు. శుక్రవారం పూర్వపు పీఠాధిపతి సుజ్ఞానేంద్రుల ఆరాధన, అశ్వవాహన సేవలు ఉంటాయి. శనివారం నాడు సర్వ సమర్పణోత్సవంలో భాగంగా బంగారు పల్లకీ, చెక్క, వెండి, బంగారు రథోత్సవ సేవలు నిర్వహించనున్నారు. ఆనవాయితీలో భాగంగా శ్రీరాఘవేంద్రస్వామి అనుగ్రహ ప్రశస్థి అవార్డులు ప్రదానం చేయనున్నారు. మైసూరు రాజవంశీకులు, పార్లమెంట్ సభ్యుడు యధువీర్ కృష్ణదత్త ఛామరాజేంద్ర వడియార్ ప్రత్యేక అతిథిగా వచ్చి ప్రశస్థి అవార్డు స్వీకరించనున్నారు. బీజీఎస్ గ్రూపు మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశనాథ స్వామిజీ, విద్వాన్ రఘుపతి ఉపాధ్యాయ, ప్రొఫెసర్ వజ్ర భూషణ్ ఓజాకు అవార్డు అందజేయనున్నారు.

మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్-1 శ్రీనివాసరావు, మేనేజర్-2 వెంకటేష్‌జోషి, మేనేజర్-3 శ్రీపతిఆచార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్ కోనాపూర్, పీఆర్వో నరసింహామూర్తి ఉత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

## విజయనగరం జిల్లా కేంద్రంలో రక్తదాన శిబిరం ఏర్పాటు




**విజయనగరం (జర్నలిస్ట్ ఫైల్):** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జరజాపుపేట సాధన యువజన సంఘం నిర్వాహకులు అత్యవసర రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లాలో రక్త నిల్వలు తక్కువగా ఉండటంతో అత్యవసర శిబిరం ఏర్పాటు చేసినట్లు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్సీసీ అధికారి ఏ.కల్యాణ్ అశోక్ తెలిపారు. 63వ సారి రక్తదానం చేసిన సాధన యువజన సంఘం అధ్యక్షులు పోలుబోతు దుర్గాప్రసాద్‌ను కొనియాడారు. ఇందులో పది మంది యువత రక్తదానం చేశారు. సాధన యువజన సంఘం ప్రధాన కార్యదర్శి పసుమర్తి వెంకటరమణ, సభ్యులు రొంగల దుర్గాప్రసాద్ 14 వ సారి, మద్దిల రాంబాబు 35 వ సారి రక్త దానం చేశారు. శ్రీను, తాలాడా శంకరరావు, రెడ్ క్రాస్ సొసైటీ పి ఆర్ ఓ ఎం.రాము, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంతటి వారైనా వదిలే ప్రసక్తి లేదు



**ఏలూరు : (జర్నలిస్ట్ ఫైల్) :** ధవళేశ్వరంలోని పోలవరం కుడి కాలువ భూసేకరణ కార్యా లయంలో ఫైళ్ల దగ్ధం ఘటనపై ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆరా తీశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని ఇలాంటివి పునరావృతం కాకుండా బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఎస్పీని ఆదేశించారు. దోషులు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తి లేదని చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.




## శ్రీ లక్ష్మి నరసింహస్వామి వారిదేవస్థానం

మంగళగిరి, గుంటూరు జిల్లా. ఫోన్ : 08645-232645



**శ్రీ స్వామి వారి దిగువ సన్నిధి జరుగు ఆర్జిత సేవలు**

| ఆర్జిత సేవ | ఆర్జిత సేవ రుసుము |
|---|---|
| తిరువంజనం | రూ.1116/- |
| బంగారు గరుడోత్సవం | రూ.5000/- |
| పెద్ద శేషవాహనము | రూ.5000/- |
| చిన్న శేషవాహనము | రూ.5000/- |
| ఊంజల్ సేవ | రూ.5000/- |
| ఆలయ ప్రదక్షిణలు | రూ.750/- |
| సుదర్శన హెూమం | రూ.3500/- |
| నరసింహ హెూమం | రూ.3500/- |
| సహస్రనామార్చన | రూ.200/- |

**శ్రీ అమ్మవారి వారి దిగువ సన్నిధి జరుగు ఆర్జిత సేవలు**

| ఆర్జిత సేవ | ఆర్జిత సేవ రుసుము |
|---|---|
| తిరువంజనం | రూ.1116/- |
| బంగారు పుష్పార్చన | రూ.300/- |
| లక్ష్మి హెూమం | రూ.3500/- |

గమనిక పండుగలు, పర్వదినములయందు ఆర్జిత సేవలు రద్దు చేయబడును

నిత్య అన్నదాన పథకం -రూ.1116/-
నిత్య గోత్ర నామ నివేదన పథకం - (1సం॥) రూ.516/-
శాంతి కల్యాణం- రూ.1500/-

**ఎగువ సన్నిధి శ్రీ పానకాల లక్ష్మినరసింహ స్వామి వారి దేవస్థానం వివిధ పూజా టికెట్ల రేట్ల వివరములు**

| పూజా | రుసుము |
|---|---|
| శ్రీఘ్ర దర్శనం | రూ.50/- |
| స్పెషల్ దర్శనం | రూ.25/- |
| ఎగువ అష్టోత్తరం | రూ.40/- |
| ఎగువ కుంకుమార్చన | రూ.30/- |
| ఎగువ బిందె శీతలం నివేదన | రూ.5/- |

**దిగువ సన్నిధి శ్రీ పానకాల లక్ష్మినరసింహ స్వామి వారి దేవస్థానం వివిధ పూజా టికెట్ల రేట్ల వివరములు**

| పూజా | రుసుము |
|---|---|
| దిగువ స్పెషల్ దర్శనం | రూ.10/- |
| దిగువ అష్టోత్తరం | రూ.40/- |
| దిగువ కుంకుమార్చన | రూ.30/- |

**ఆలయ దర్శన వేళలు (ఎగువ సన్నిధి)**

| | |
|---|---|
| పానకం నివేదన | ఉ7-మ 3గం॥ |
| కవాట బంధనం | సా॥4గం॥ |

**ఆలయ దర్శన వేళలు (దిగువ సన్నిధి)**

ఉదయం 8 -మ.1గం.లకు
సాయంత్రం 4-6.30గం.లకు
6.30గం. సంధ్యవేళ, రాత్రి 8.గం॥లకు



ఇట్లు
స్వామి వారి సేవలో ...
సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వాహణాధికారి


## మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లా దార్శనికత-కార్యాచరణ ప్రణాళిక



**ఎన్టీఆర్ (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతలు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లా దార్శనికత-కార్యాచరణ ప్రణాళిక (2024-29) రూప కల్పనకు ప్రతి శాఖ ప్రగతి ప్రణాళిక రూపొందించాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ జి.సృజన ఆదేశించారు. వీటిని ఈ నెల 31వ తేదీలోగా సీపీవో కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వికసిత్ ఆంధ్రా-2047, జిల్లా దార్శనికత, కార్యాచరణ ప్రణాళిక కార్యశాలను నగరంలోని విడిది కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. రానున్న 5 సంవత్సరాల్లో గణనీయ పురోగతి సాధనకు అనుసరించే ప్రణాళికను చిత్తశుద్ధి, నిబద్ధతతో రూపొందించాలని సూచించారు. పేదరిక నిర్మూలన, సాంఘిక, భౌతిక మౌలిక వసతుల పురోగతి, జీవన సౌలభ్యం, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాల పెంపు, నాణ్యమైన సేవలు, టెక్ అనుసంధాన ఆరోగ్య సంరక్షణ, డిజిటల్ గవర్నెన్స్ తదితర అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ఏటా 15 శాతం వృద్ధి సాధించాలని, దీనికోసం నిపుణులు, ముఖ్య సంస్థల సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. జిల్లా సమగ్రాభివృద్ధిలో కీలక భాగస్వాములు కావాలని సూచించారు.

## భర్త ముందే భార్యపై సామూహిక అత్యాచారం

**ఏలూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ఏలూరు నగరంలో ఘోరం జరిగింది. మూడు పోలీస్‌స్టేషన్లకు కూతవేటు దూరంలో ఓ మహిళపై భర్త ఉండగానే దుండగులు సామూహిక అత్యాచారానికి తెగబడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. పెదవేగి మండలం విజయరాయికి చెందిన ఓ వ్యక్తి, భార్యతో సహా కూలి పనుల కోసం ఏలూరు వచ్చాడు. ఓ హెూటల్‌లో పగలు పనిచేసుకుని, రాత్రి పూట ప్రదర్శనలు ఇచ్చే రామకోటి స్టేజీపై నిద్రిస్తుంటారు. అద్దె ఇంటికోసం ప్రయత్నిస్తున్నాడు. అయితే ముగ్గురు యువకులతో కలసి విజయరాయికి చెందిన వ్యక్తి కలసి మద్యం సేవించాడు. మత్తు బాగా ఎక్కిన తరవాత అతన్ని బెదిరించి, అతని భార్యపై అత్యాచారం చేశారు. అతను రోడ్డుపైకి పరుగులు తీసి కేకలు వేయడంతో ఓ యువకుడు రక్షించేందుకు వచ్చాడు. అంతలో దుండగులు పారిపోయారు. ఆలస్యంగా ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. సమీపంలోని సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితులు చెంచుల పేటకు చెందిన నాగేంద్ర, పవన్, రంగారావుగా గుర్తించి అరెస్ట్ చేశారు. కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. 100 నెంబరుకు కాల్ చేసినా పోలీసులు స్పందించలేదని బాధితుడు తెలిపారు. నగరం మధ్యలో మూడుపోలీస్ స్టేషన్లకు కూత వేటు దూరంలో సామూహిక అత్యాచారం జరిగినా పోలీసులు స్పందించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## అగ్నిప్రమాదంపై ఎన్నో అనుమానాలు: ఎమ్మెల్యే శ్రీనివాసులు

**తిరుపతి (జర్నలిస్ట్ ఫైల్) :** తితిదే పరిపాలన భవనంలోని ఇంజినీరింగ్ విభాగంలో అగ్ని ప్రమాదం జరగడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులు అన్నారు. అగ్ని ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైల్స్ దగ్ధం ఘటనను మరువకముందే తితిదే కార్యాలయంలో అగ్ని ప్రమాదం జరగడం అనుమానం కలిగిస్తోందన్నారు. ఇటీవల తితిదే ఇంజినీరింగ్ విభాగంలోని పలువురికి విజిలెన్స్ అధికారులు తాకీదులు ఇచ్చినట్లు గుర్తు చేసిన ఆయన.. అంతలోనే అగ్నిప్రమాదం చోటు చేసుకోవడం వెనక కారణాలపై లోతుగా ఆరా తీయాల్సిన అవసరముందన్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చాలా సీరియస్‌గా ఉన్నారని చెప్పారు. పోలీసు దర్యాప్తులో నిజానిజాలు వెలువడుతాయని, తప్పు చేసిన వాళ్లకు చట్టపరంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు.

## గ్రీన్ ఎనర్జీ చాంపియన్ గా ఆంధ్రప్రదేశ్




**(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ అరుదైన ఘనత సొంతం చేసుకుంది. ఇండియన్ విండ్ పవర్ అసోసియేషన్ 2023–24 ఏడాదికి గాను ఆంధ్రప్రదేశ్ ను గ్రీన్ ఎనర్జీ చాంపియన్ గా ప్రకటించింది. తమిళనాడులోని కోయంబత్తూరులో జరిగిన సమావేశంలో ఈ అవార్డును కేంద్రం, ఏపీకి ప్రదానం చేసింది. .ఏపీ సోలార్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ, సీఈవో ఎం. కమలాకర్ బాబు కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ సంయుక్త కార్యదర్శి లలిత్ బోరా నుంచి ఈ పురస్కారం అందుకున్నారు. మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాలు పోటీ పడినప్పటికీ ఏపీ వాటిని అధిగమించి అవార్డును సొంతం చేసుకుంది. చంద్రబాబు కృషితోనే రాష్ట్రానికి ఈ అవార్డు దక్కిందని కమలాకర్ బాబు అన్నారు. 2014–19 మధ్య కాలంలో పునరుత్పాదక ఇంధన రంగంలో అప్పటి ప్రభుత్వం చేసిన కృషి ఇప్పుడు అవార్డు రావడానికి కారణమైందన్నారు.

## విజయవాడ అభివృద్ధికి కృషి చేస్తామన ఎంపీ కేశినేని



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** రాజధాని అమరావతితో పాటు విజయవాడ అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. విజయవాడలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాల్గొన్నారు. వారిని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా కేశినేని శివనాథ్ మాట్లాడుతూ.. అమరావతిలో 2027లో నేషనల్ గేమ్స్ నిర్వహించేందుకు కృషి చేస్తామని చెప్పారు. మంగళగిరిలోని క్రికెట్ స్టేడియాన్ని ఆరు నెలల్లో ప్రారంభిస్తామన్నారు. విజయవాడలో క్రికెట్ అకాడమీ స్థాపనకు కృషి చేస్తామని తెలిపారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యుల సమస్యలపై ఎంపీ సానుకూలంగా స్పందించారు. ఇటీవల కేశినేని శివనాథ్ ఆంధ్రా క్రికెట్ సంఘం (ఏసీఏ) అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి తెలిసిందే.

## శ్రీశైలం మల్లన్న భక్తులకు శుభవార్త, స్పర్శ దర్శనంపై కీలక నిర్ణయం



**కర్నూలు జిల్లా (జర్నలిస్ట్ ఫైల్) :** భక్తులకు శ్రీశైలం మల్లికార్జున స్వామి దేవస్థానం శుభవార్త చెప్పింది. శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా ఈ నెల 15 నుంచి 19 వరకు ఐదురోజుల పాటు స్పర్శ దర్శనానికి భక్తులను అనుమతిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తుల రద్దీ దృష్ట్యా కేవలం అలంకార దర్శనాలు మాత్రమే కల్పించాలని గతంలో నిర్ణయించినప్పటికీ మార్పు చేసినట్లు వివరించారు. భక్తుల నుంచి వస్తున్న వినతుల మేరకు ఆది, సోమవారాల్లో స్పర్శ దర్శనాలు పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. నిర్దిష్ట సమయాల్లో నాలుగు విడతలుగా దర్శనం కల్పిస్తామన్నారు. మొదటి విడతలో ఉదయం 6.45 నుంచి 8.30 వరకు, రెండో విడతలో మధ్యాహ్నం 12.00 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు, మూడో విడతలో భాగంగా రాత్రి 8 నుంచి 9 వరకు, చివరగా రాత్రి 10 గంటల నుంచి 11.30 గంటల వరకు స్పర్శ దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. స్పర్శ దర్శనం టికెట్లను కేవలం ఆన్‌లైన్ ద్వారా మాత్రమే తీసుకోవాల్సి ఉంటుంది. టికెట్ల లభ్యతను బట్టి గంట ముందుగా టికెట్లను జారీ చేయనున్నారు. దేవస్థానానికి చెందిన వెబ్‌సైట్ %ంతీఱయఖఱశ్రీఖఎవఝుర్ష్ఖుఖఎ. శీతీస్త్ర% లో టికెట్లు బుక్ చేసుకోవచ్చు.

## తిరుమల శ్రీవారి ఆలయంలో శ్రావణ పౌర్ణమి గరుడసేవ

తిరుమల (జర్నలిస్ట్ ఫైల్): కలియుగ దైవం తిరుమల శ్రీవారి ఆలయంలో ఆగస్టు 19వ తేదీన శ్రావణ పౌర్ణమి గరుడసేవ జరగనుంది. రాత్రి 7 నుంచి 9 గంటల మధ్య సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు సువర్ణకాంతులీనుతున్న గరుడ వాహనంపై తిరుమాడ వీధుల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ప్రతినెలా పౌర్ణమి సందర్భంగా తిరుమలలో గరుడసేవ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

# అప్పన్నను కుటుంబస సమేతంగా దర్శించుకున్న హోంమంత్రి



**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ హోంశాఖా మంత్రి, టీడీపీ సీనియర్ లీడర్ వంగలపూడి అనిత కుటుంబంతో కలిసి సింహాచలం అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. సింహాచలం అప్పన్న స్వామి తొలి పావంచ వద్ద కొబ్బరికాయ కొట్టి 1040 మెట్లు ఎక్కి స్వామివారిని దర్శించుకున్నారు. మెట్ల మార్గంలో ఉన్న దేవతామూర్తులను దర్శించుకుంటూ భక్తులతో ఆమె మాట్లాడారు. పలువురు భక్తులు హోంమంత్రితో సెల్ఫీలు తీసుకున్నారు. భక్తులను పలకరిస్తూ అనిత ఉత్సాహంగా కొండకు చేరుకున్నారు. ఆలయ మర్యాదలతో హోంమంత్రికి ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం స్వామివారి దర్శనం అనంతరం వేద ఆశీర్వచనం పొందారు. అనంతరం స్వామివారి ప్రసాదాన్ని ఆలయ అధికారులు అందజేశారు. మెట్ల మార్గం గుండా వెళ్లి స్వామివారిని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. లక్షలాది మంది భక్తులు నడిచి వచ్చే మెట్ల మార్గాన్ని గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విచారం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో కొత్త మెట్లు మార్గాన్ని చైర్మన్ అశోక్ గజపతిరాజు మొదలుపెట్టారని, అయితే వైసీపీ ప్రభుత్వం దాన్ని మధ్యలోనే నిలిపివేసిందని అన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆలయ ఈవోకి తాను చెప్పానని అనిత వెల్లడించారు. లక్ష్మీ నరసింహ స్వామి ఆశీస్సులు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లపై ఉండాలని భగవంతుని ప్రార్థించానని ఆమె చెప్పారు.

# శ్రావణ మాసంలో కొండ దిగిన కోడి



**(జర్నలిస్ట్ ఫైల్) :** మాంసం ప్రియులకు గుడ్‌న్యూస్.. గత కొన్ని నెలలుగా కొండెక్కి కూర్చున్న చికెన్ ధరలు దిగొచ్చాయి. గత నెలలో కిలో చికెన్ రూ. 280 నుంచి రూ. 300 వరకు పలికిన సంగతి తెలిసిందే. దీంతో చికెన్ రేట్లు చూసి సామాన్యుడు తినలేక గుటకలు మింగి సరిపెట్టుకున్నాడు. శుభకార్యాలు, పంక్షన్లకు కూడా అత్యవసరం అయితే తప్ప చికెన్ కొనలేని పరిస్థితి. ఇలా ఈ ఏడాది ప్రారంభం నుంచి చికెన్ రేట్లు చుక్కలు చూపిస్తూనే వచ్చాయి. కానీ అనూహ్యంగా ఈ నెల మొదటి వారం నుంచి చికెన్ ధరలు రోజురోజుకు పతనమవుతూ వచ్చాయి. అందుకు కారణం లేకపోలేదు. ప్రస్తుతం శ్రావణ మాసం కావడంతో ఈ నెలంతా పూజలు, వ్రతాలు ఇతర కార్యక్రమాలతో మహిళలు యమ బిజీగా ఉంటారు. దీంతో మహిళలు మాంసాహారాన్ని ఇంట్లోకి రానివ్వరు. మగవారు నేరుగా చికెన్ కొని ఇంటికి తీసుకెళ్లలేని పరిస్థితి. ఏదో రెస్టారెంట్‌కి వెళ్లి తినాల్సిందే. దీంతో చికెన్ వినియోగం తగ్గి ధరలు కూడా పడి పోయాయి. మరోవైపు పూజలు, వ్రతాలతో సంబంధం లేని మరి కొందరు మాంసం ప్రియులు ఇదే అదనుగా చికెన్ లాగించేస్తున్నారు. ఆగస్టు 5న కిలో రూ. 180 ఉన్న చికెన్ ధర.. ఆగస్టు 11వ తేదీ ఆదివారం నాటికి రూ. 150కి పడిపోయింది. ఆగస్టు 17వ తేదీ శనివారం రూ. 158గా ఉంది. ప్రస్తుతం శ్రావణమాసం కావడంతో ఆదివారాలతో సహా అన్ని రోజుల్లో దాదాపు ఇవే ధరలు కొనసాగుతున్నాయి. సాధారణంగా ఆదివారాల్లో గిరాకీ ఎక్కువగా ఉంటుంది. దీంతో మిగతా రోజుల సంగతి ఎలా ఉన్నా.. ఆదివారం రాగానే చికెన్ రేట్లు అమాంతం పైకి ఎగబా కుతాయి. కానీ శ్రావణ మాసం కావడంతో అసలు కొనేవారే కరువయ్యారు. దీనిపై చికెన్ సెంటర్ యజమానులు మాట్లాడుతూ.. త్వరలోనే మళ్లీ చికెన్ ధరలు పుంజుకుంటాయని చెబుతున్నారు. ప్రస్తుతం శ్రావణమాసం కావడం, ఇతర పూజలు ఉన్నందున చికెన్ ధర రూ. 150కి తగ్గిందని చెబుతున్నారు. గత నెలలో రూ. 280 వరకు ఉందని అన్నారు. ఈ నెలలో వివాహాలు, శుభాకార్యా లు కూడా ఉన్నందున చికెన్ ధర పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు..

# డాబాపై కాలీఫ్లవర్ ను పెంచుతున్న రైతులు



ఇంటి వద్దే మనకు కావాల్సిన తాజా కూరగాయలను ఎప్పటికప్పుడు పండించుకోవచ్చు. ఇంటి పెరటిలోగాని, టెర్రస్ పైనగాని, అపార్ట్మెంట్ వాసులైతే బాల్కనీల్లో గాని తాజాగా కూరగాయ మొక్కలు పెంచుకోవచ్చు. మనలో చాలా మందికి కాలీఫ్లవర్ అంటే ఇష్టం కానీ మార్కెట్లో అన్ని సమయాల్లో ఇది మనకు దొరకదు. అలాంటప్పుడు మన ఇళ్లలో కూడా పెంచుకోవచ్చు. సంవత్సరమంతా కాలీఫ్లవర్ కూరను రుచిచూడవచ్చు. దీనిని హైబ్రిడ్ విత్తనాల ద్వారా ఏడాది పొడవునా పెంచవచ్చు. 1522 రకాల విత్తనాలను పొలాల్లో లేదా డాబాపై కుండీలలో వేసి, పండించవచ్చు. కాలీఫ్లవర్ లో పోషకాలు కూడా అధికంగా ఉంటాయి. మరీ ముఖ్యంగా అధికంగా సీ విటమిన్ తో పాటు కె విటమిన్, పోటాషియం, మాంగనీస్, ప్రొటీన్ లు ఉన్నాయి. అందువల్ల కాలీఫ్లవర్ ను ఆహారంగా తీసుకోవడంతో శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. గుండె సంబంధిత వ్యాధులు, వివిధ రకాల క్యాన్సర్ల ప్రభావాన్ని సైతం కాలీఫ్లవర్ తగ్గిస్తుంది. డాబాపై, కొద్ది ప్రదేశంలో కూడా దీన్ని పండించవచ్చు. కాలీఫ్లవర్ మొక్కను నాటితే 55 నుంచి 60 రోజుల్లో ఫ్లవర్ తయారవుతుంది.

ప్రస్తుతం మార్కెట్లో మూడు రకాల కాలీఫ్లవర్ విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. అవి స్వల్పకాలిక రకాలు, మధ్యకాలిక రకాలు, దీర్ఘకాలిక రకాలు ఉన్నాయి. వాటిల్లోని మన సాగు చేసే నేలకు అనువైన రకాలను ఎంచుకోవాలి. స్వల్ప కాలిక రకాలు –జులై–ఆగష్టు, మధ్య కాలిక రకాలు – ఆగష్టు –సెప్టెంబర్, దీర్ఘ కాలిక రకాలు –సెప్టెంబర్ – అక్టోబర్. విత్తనాలను మీకు దగ్గరలో ఉన్న నర్సరీల నుండిగాని, ఉద్యానశాఖ నుంచి కొనుగోలు చేసుకోవాలి. కాలిఫ్లవర్ నారు పెంచి నాటుకోవాలి. నారు వయస్సు 25 – 30 రోజుల మధ్య మొక్కలను నాటుకోవడానికి సిద్ధం చేసుకోవాలి. మొక్కలను నాటుకునేప్పుడు మొక్కల మధ్య దూరం 45 సెం. మీ. దూరాలు ఉండేలా చూసుకోవాలి. క్యాలిఫ్లవర్ పెరుగుదల ఉష్ణోగ్రత మరియు కాంతి సమయం పై ఆధారపడి ఉంటాయి.

కావున సరైన సమయానికి సరైన రకం ఎన్నుకోవడం చాలా ముఖ్యం. సాధారణంగా స్వల్ప కాలిక రకాలు చిన్నావిగా పసుపు రంగు గల ఫ్లవర్ ను, మధ్యస్థ రకాలు పెద్ద ఫ్లవర్ ను మాములు తెలుపు రంగులో మరియు దీర్ఘ కాలిక రకాలు దిట్టంగా పాల తెలుపు గల ఫ్లవర్ ను ఇస్తాయి.

క్యాలీఫ్లవర్ కు సేంద్రియ పదార్థం సమృద్ధిగా ఉండే మట్టి అవసరం అవుతుంది. 6.0 నుంచి 7.0 మధ్య జూం పరిధిలో బాగా పెరుగుతుంది. మట్టి బాగా ఎండిపోవాలి, కానీ క్యాలీఫ్లవర్ కు బటన్ లు నిరోధించడానికి స్థిరమైన తేమ అవసరం అవుతుంది. క్యాలిఫ్లవర్ పువ్వు తెల్లగా మరియు మచ్చలు లేకుండా నాణ్యంగా ఉండాలంటే పెరుగుతున్న పువ్వులోనికి సూర్య రశ్మి చేరకుండాజాగ్రత్త పడాలి.

దీనికి గాను పువ్వు చుట్టు ఉన్న ఆకులలో చివరి వరుస ఆకులను కప్పుతూలేదా రబ్బరు బాండ్ తో కట్టాలి. పువ్వు సరైన పరిమాణం అయినా తర్వాత కోయాలి. క్యాలీఫ్లవర్ ని గది ఉష్ణోగ్రత దాదాపు 4–5 రోజులు నిల్వ చేయవచ్చు.

# కోల్‌కతా ఘటనపై కేంద్రం సీరియస్




**(జర్నలిస్ట్ ఫైల్) :** జూనియర్ డాక్టర్ హత్య, అత్యాచారం ఘటన తరవాత దేశ వ్యాప్తంగా ఆందోళనలు మొదలైన సంగతి తెలిసిందే. కోల్‌కతా కేసు విచారణ సీబీఐకి అప్పగించారు. ఇక దేశ వ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని అధికారులను కేంద్ర హోం శాఖ ఆదేశించింది. ప్రతి రెండు గంటలకు సమాచారం మెయిల్, వాట్సప్, ఫ్యాక్స్ ద్వారా కేంద్ర హోం శాఖ ఢిల్లీలో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూంకు పంపాలని ఆదేశించారు. ఇలా రెండు నెలలపాటు సమాచారం పంపాలని అన్ని జిల్లాల అధికారులను హోం శాఖ ఆదేశించింది. కోల్‌కతా ఆర్జీ కర్ ఆసుపత్రి డాక్టర్ హత్య, అత్యాచారం తరవాత దేశ వ్యాప్తంగా వైద్యులు చేపట్టిన నిరసనలు రెండో రోజుకు చేరాయి. డాక్టర్లకే రక్షణ లేకుంటే రోగులను రక్షించలేమంటూ నిరసనలు తెలిపారు. డాక్టర్ హత్యకేసును వెంటనే తేల్చి, నిందితులను కఠినంగా శిక్షించాలంటూ పలు నగరాల్లో డాక్టర్లు ర్యాలీలు నిర్వహించారు. కోల్‌కతా ఘటన తరవాత బెంగాల్ ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. రాత్రి సమయాల్లో మహిళలకు డ్యూటీలు వేసేప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రతా చర్యలను పెంచింది. మహిళలు రాత్రి విధులు నిర్వహించే ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు, కనీసం ఇద్దరు మహిళలకు ఒక చోట రాత్రి విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని బెంగాల్ సీఎం ఆదేశించారు. ఇక రాత్రి మహిళలు విధులు నిర్వహించే ప్రాంతాల్లో వాలంటీర్లను కాపలాగా ఉంచాలని నిర్ణయించారు.

## హిమాచల్‌ప్రదేశ్‌లో ఆకస్మిక వరదలు : కొట్టుకుపోయిన రోడ్లు, ఇళ్లు



**(జర్నలిస్ట్ ఫైల్) :** హిమాచల్‌ప్రదేశ్‌లో ఆకస్మిక వరదలు విరుచుకుపడ్డాయి. జనజీవనం స్థంభించిపోయింది. రోహ్డూ రామ్‌పూర్ జాతీయ రహదారి ధ్వంసమైంది. సిమ్లా జిల్లా రామ్‌పూర్ జాతీయ రహదారి 5 సహా, 132 రోడ్లు మూసివేశారు. చంబా, సిర్మౌర్ ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడ్డాయి. 1256 విద్యుత్ సబ్ స్టేషన్లు దెబ్బతిన్నాయి. గడచిన మూడు నెలలుగా వరదలు హిమాచల్‌ప్రదేశ్‌ను వెంటాడుతున్నాయి. తాజా ఆకస్మిక వరదలతో వేలాది మంది నిరాశ్రయులయ్యారు. పంటలు దెబ్బతిన్నాయి. సిమ్లా, మండి, కులూ, చంబా, కనౌర్, సిర్మౌర్ జిల్లాల్లో 132 రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వంతెనలు కొట్టుకుపోయాయి. వేలాది ఎకరాల్లో యాపిల్ తోటలు ధ్వంసం అయ్యాయి. ఈ నెల 23 వరకు ఈ ప్రాంతాల్లో ఎల్లో అలర్ట్ ప్రకటించారు. పర్యాటకరంగానికి తీవ్ర విఘాతం ఏర్పడింది.

## మొబైల్ నుంచి యూపీఐ ద్వారా విద్యుత్ బిల్లు చెల్లించవచ్చు



**(జర్నలిస్ట్ ఫైల్) :** విద్యుత్తు బిల్లులను గతంలోలా మొబైల్ నుంచి యూపీఐ ద్వారా చెల్లించవచ్చు. తెలుగు రాష్ట్రాల్లో విద్యుత్తు బిల్లుల చెల్లింపులు సరళీకృతం చేసేందుకు మార్గం సుగమం అయింది. తెలంగాణలోని టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్పీడీసీఎల్, ఆంధ్రప్రదేశ్‌లోని ఏపీసీపీడీసీఎల్‌లు భారత్ బిల్ పేమెంట్ సిస్టం(బీబీపీఎస్)లో చేరడంతో చెల్లింపులు సులభం అయ్యాయి. డిస్కంలు బీబీపీఎస్‌లోకి రావడంతో ఇకపై బ్యాంకులు, ఫిన్‌టెక్ యాప్‌లు, వెబ్‌సైట్‌లతో పాటు బీబీపీఎస్ ఆధారిత ప్లాట్‌ఫామ్‌ల ద్వారా కూడా సురక్షితంగా చెల్లింపులు చేయవచ్చు. ఈ విషయాన్ని ఎన్‌పీసీఐకి చెందిన భారత్ బిల్ పే లిమిటెడ్(బీబీఎల్) సీఈవో నూపూర్ చతుర్వేది వివరించారు. రిజర్వ్ బ్యాంక్ జులై 1 నుంచి యూపీఐ ద్వారా నేరుగా విద్యుత్తు బిల్లుల చెల్లించడాన్ని నిలిపివేసింది. బీబీపీఎస్ ఆధారిత ప్లాట్‌ఫామ్‌ల ద్వారానే లావాదేవీలు జరగాలని నిర్దేశించింది. ఈ క్రమంలో విద్యుత్ సంస్థలు బీబీపీఎస్‌లోకి చేరాయి. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోని వినియోగదారులు ఫోన్ పే ద్వారా చెల్లింపులు చేస్తున్నారు.

## ఆటో డ్రైవర్‌ను అభినందించిన నన్నపనేని



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్) :** దుగ్గిరాల సమీపంలో రహదారిపై ఏర్పడ్డ రెండు పెద్ద గుంతలను ఆటో డ్రైవరు నాగరాజు మట్టితో పూడ్చారు. ఆపనులు చేస్తుండగా అదే సమయంలో అటువైపు వెళ్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి కారు ఆపి ఆయన్ను అభినందించారు. ఆమె కొంత నగదు ఇవ్వబోగా తిరస్కరించారు. ఈ రహదారిని సత్వరమే బాగు చేయించుకోవాల్సిన అవసరం ఉందని రాజకుమారి చెప్పారు. వైకాపా పాలనలో పూర్తి నిర్లక్ష్యానికి గురి కావటం వల్ల మరీ దారుణంగా తయారైందన్నారు. ఆటో డ్రైవరు నాగరాజు తెనాలిలోని గంగానమ్మపేటలో పండ్ల వ్యాపారి పున్నయ్య వద్ద పని చేస్తున్నారు. రోజూ ఆటోలో పండ్లు తీసుకొస్తున్నప్పుడు ఈ గోతుల వద్ద వాహనాలు తరచూ అదుపు తప్పుతూ ఉండటాన్ని గమనించి వాటిని పూడ్చమని నాగరాజును పంపినట్లు పున్నయ్య వివరించారు.

## వినేశ్ ఫొగాట్‌కి 750 కేజీల లడ్డులతో అపూర్వ స్వాగతం



**(జర్నలిస్ట్ ఫైల్) :** కేవలం 100 గ్రాముల బరువు ఎక్కువుందనే కారణంతో ఒలింపిక్ రెజ్లింగ్ పోటీల్లోంచి స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ ని తొలగించిన విషయం తెలిసిందే. కాస్ కూడా అనుకూల తీర్పు ఇవ్వకపోవడంతో స్వదేశానికి పయనమైన వినేశ్ తన స్వగ్రామానికి చేరుకున్నారు. ఢిల్లీ విమానాశ్రయంలో దిగిన అనంతరం ఆమె హరియాణా చర్కీ దాద్రీ జిల్లా బలాలికి బయల్దేరారు. ఢిల్లీ నుంచి బలాలికి చేరుకోవడానికి సుమారు 10 గంటల సమయం పట్టింది. గ్రామానికి చేరుకున్న అనంతరం వినేశ్‌కి గ్రామస్థులు అపూర్వ స్వాగతం పలికారు. ఆమెకు ప్రైజ్‌మనీ ఇచ్చారు. ఓ వాచ్‌మెన్ కూడా వినేశ్ కోసం రూ. 100 ఇచ్చాడు. గ్రామస్థులంతా కలిసి రూ. 21 వేలు ఆమెకు బహుమతిగా అందజేశారు. ఇది పెద్ద మొత్తం కాకపోయినా.. వారి ప్రేమాభిమానాలపట్ల హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రైజ్‌మనీతోపాటు 750 కిలోల లడ్డూలనూ ఆమెకు అందజేశారు. వాటిని ఊరంతా పంచారు. గ్రామస్థుల అభిమానం, ప్రేమపట్ల వినేశ్ భావోద్వేగానికి లోనయ్యారు. అంతకుముందే ఆమెకు ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో ఘన స్వాగతం లభించింది. అనంతరం నిర్వహించిన ర్యాలీలో రెజ్లర్లు బజరంగ్ పునియా, సాక్షి మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

## సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్న కొల్లు రవీంద్ర

**మోపిదేవి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి శ్రీవల్లీ, దేవసేనా సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర దర్శించుకున్నారు. అంతకుముందు మంత్రికి ఆలయ అధికారులు, పండితులు ఘన స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలోని పుట్టలో మంత్రి పాలు పోసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, వేద పండితులు, అర్చకులు మంత్రిని మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.



కలకత్తా డ్యూటీ డాక్టర్ పై జరిగిన

# అఘాయిత్యం దారుణం

**టీఎమ్మార్పిఎస్ మండల అధ్యక్షులు గురవయ్య.**



**నడిగూడెం :** కోల్ కత్తా డ్యూటీ మహిళ డాక్టర్ పై జరిగిన అఘాయిత్యానికి నిరసనగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ దేశ వ్యాప్తంగా వైద్య సేవలు నిలిపివేస్తూ డాక్టర్స్ చేసిన బంద్ కు టీఎమ్మార్పిఎస్ మద్దత్తు తెలిపిందని టీఎమ్మార్పిఎస్ నడిగూడెం మండల అధ్యక్షులు బందారి గురవయ్య శనివారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ... కలకత్తా లో మహిళ డాక్టర్ దారుణ హత్య దారుణమని ప్రతి ఒక్కరూ ముక్త కంఠం తో ఖండించాలిని ఆయన అన్నారు. మహిళ డాక్టర్ ను హత్య చేసిన నిందుతుడిని కఠినంగా శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాని డిమాండ్ చేశారు.దేశం లో ఇలాంటి ఘటన లు పునరావృతం కాకుండా చూడాలని ఆయన అన్నారు.

# డాక్టర్ మౌమిత డెబ్నత్ కి న్యాయం చేయాలి

**డాక్టర్ మౌమిత డెబ్బత్ కి మద్దతుగా యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన**

**హత్యాచారానికి పాల్పడిన నిందితులను ఉరితీయాలి**

**బొబ్బిలి :** కలకత్తాలో జూనియర్ డాక్టర్ మౌమిత డెబ్నత్ కి మద్దతుగా బొబ్బిలిలో యుటిఎఫ్,ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీగా నిరసన కార్యక్రమం చేయడం జరిగింది.డాక్టర్ మౌమిత డెబ్నత్ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని నిందితులను ఉరితీయాలని జూనియర్ డాక్టర్లకు రక్షణ కల్పించాలని స్త్రీలకు జరుగుతున్న అరాచ కాలపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని స్త్రీల కోసం ఉన్న దిశ, నిర్భయ, పోక్స్ చట్టాలు పేపర్లుగానే ఉంటున్నాయని వాటిని ప్రతిష్ట చేయడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని అంటూ రానున్న కాలంలో స్త్రీలపై ప్రభుత్వం దృష్టి సారించాలని స్త్రీలకు భద్రత కల్పించాలని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు విజయ గౌరీ అన్నారు.యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ, స్త్రీలపై జరుగుతున్న హత్యాచారాలు రాను రాను పెరుగుతున్నాయి వీటిపై ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో పాటు స్త్రీలు వారి సత్తాను చూపించే క్రీడార రంగంలో కూడా రాజకీయాలను తీసుకొస్తున్నారు ఇది చాలా దుర్మార్గం అన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి మణికుమార్ మాట్లాడుతూ,కలకత్తాలో డాక్టర్ మౌమిత డెబ్నత్ కి జరిగిన అన్యాయంపై విద్యార్థి,ఉపాధ్యాయ,ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి.జూనియర్ డాక్టర్ పై హత్యాచారానికి పాల్పడిన నిందితులను ఉరితీ యాలని జూనియర్ డాక్టర్లకు రక్షణ కల్పించాలని లేకుంటే విద్యార్థులు, విద్యార్థినిలు, ఉపాధ్యాయులు, జూనియర్ డాక్టర్లు అందర్నీ ఏకం చేసుకుని ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తీ సుకొస్తామని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు శ్రీనివాస్, కృష్ణ దాస్, శ్రీను ఎస్ఎఫ్ఐ నాయకులు జానీ, చరణ్ మరియు విద్యార్థినిలు, తదితరులు పాల్గొన్నారు.



కలకత్తా డ్యూటీ డాక్టర్ పై జరిగిన అఘాయిత్యానికి నిరసన తెలుపుతున్న

# కంచికచర్ల,పెండ్యాల వైద్య సిబ్బంది

**కంచికచర్ల :** కోల్ కత్తా డ్యూటీ మహిళ డాక్టర్ పై జరిగిన అఘాయిత్యానికి నిరసన తెలుపుతూ.., కంచికచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కే మధురిమ, పెండ్యాల పీహెచ్సీ డాక్టర్ జెస్సీ లివింగ్ ఫెయిత్, డాక్టర్.పవన్ నరేంద్ర వర్మ. డాక్టర్ స్నేహ, తమ సిబ్బందితో కలిసి ముక్తకంఠంతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పెండ్యాల పి హెచ్ సి . డాక్టర్. జెస్సీ మాట్లాడుతూ..,కోల్ కత్తా లో అఘాయిత్యము జరిగిన డ్యూటీ మహిళా డాక్టర్ కి,డ్యూటీ లో ఉన్న డాక్టర్ల కి,మరియు సిబ్బంది కి వెంటనే రక్షణ కల్పించాలని, నిరసన తెలియజేస్తున్నామని అన్నారు.కంచికచర్ల మండలం లోని వైద్యాధికారులు మరియు వైద్య ఆరోగ్య సిబ్బంది చెవిటి కల్లు సెంటర్ నుండి ఎండిఓ ఆఫీసు వరకు నిరసన వ్యక్తం చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంచికచర్ల పి హెచ్ సి. డాక్టర్ కె. మధురిమ, పెండ్యాల పిహెచ్ సి. డాక్టర్.జెస్సీ లివింగ్ ఫెయిత్,పవన్ నరేంద్ర వర్మ, డాక్టర్. స్నేహ,కంచికచర్ల పి హెచ్ సి .మరియు పర్యవేక్షక సిబ్బంది జీవి.రాఘ వేంద్ర రావు, బి.శౌరీ లమ్మ, షేక్ .దస్తగిరి, ల్యాబ్ టెక్నీషియన్ లు కె..శ్రీనివాసరావు,సాంబశివరావు ,కంచికచర్ల %ు% పెండ్యాల ఏఎన్ఎం. లు, సి హెచ్ ఓ. లు,మరియు ఆషా లు మొదలగు వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొని తమ నిరసన ను వ్యక్తం చేసి ఇటువంటి ఘటన లు పునరావృతం అవకూడదని సంయుక్తం గా ముక్త ఖ%ళీ% టం తో ఖండించి తమ నిరసన ను వ్యక్తం చేస్తూ ర్యాలీ నిర్వహించారు



నూతన ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణని మర్యాదపూర్వకంగా కలిసిన

# బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి



**బొబ్బిలి :** విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో ఎమ్మెల్సీగా ఏకగ్రీ వంగా ఎన్నికైన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణని,శనివారం సాయం త్రం బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పల నాయుడు మర్యాదపూర్వకంగా కలిసి, పుష్ప గుచ్చం అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆయనతో విజయనగరం జిల్లా డాక్టర్స్ సెల్ అధ్యక్షులు బొత్స కాశినాయుడు,పిఎసిఎస్ అధ్యక్షులు బొమ్మి అప్పలనాయుడు,మాజీ జేసిఎస్ కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదర్ తదితరులు వున్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థికి అభినందించిన

# ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్పల్లి :** ఆగస్టు 11వ తేదీన ఒడిశా భువనేశ్వర్ లో జరిగిన 40వ సబ్ జూనియర్, 50వ జూనియర్ నేషనల్ ఆక్వాటిక్ ఛాంపియన్ షిప్ పోటీల్లో కూకట్పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ ఫిరోజ్ గూడా కు చెందిన పదవ తరగతి బేగంపేట్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో చదువుతున్న తేజస్ కుమార్ 50, 100 మీటర్ల బటర్ ఫ్లై విభాగంలో రెండు కాంస్య పథకాలు అలాగే 200 మీటర్స్ బట్టర్ ఫ్లై విభాగంలో ఒక సిల్వర్ మెడల్ గెలుచుకు న్నారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో అభినందించారు. ఆయన మాట్లాడుతూ



క్రీడల్లో కూకట్పల్లికి చెందిన విద్యార్థులు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఎంతో ప్రతిభ కనబరు స్తున్నారని ఇందుకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు అలాగే తల్లితండ్రులు కూడా పిల్లల ఆసక్తిని గమనించి క్రీడల పట్ల ప్రోత్సహిస్తే వారు అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి పొందుతారని అంతే కాకుండా క్రీడలు వారు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు.. క్రీడలను ప్రోత్సహించేందుకే గత పదిఏళ్ల నుంచి నియోజకవర్గంలోని అనేక మౌలిక సదుపాయాలు కల్పిస్తూ వచ్చామని ఇవన్నీ కూడా ప్రజలు ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు.

ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా

# విజయవాడ ఎంపీ కేసినేని శివనాథ్



**విజయవాడ :** ఎ సి ఎ అధ్యక్షుడిగా విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా విజయవాడ ఎంపీ కేసినేని చిన్ని అలియాస్ శివనాద్, ఉపాధ్యక్షుడిగా వెంకటప్రసాద్ ఎన్నికయ్యారు. కార్యదర్శిగా సానా సతీష్, జాయింట్ సెక్రటరీగా విష్ణు కుమార్ రాజు, కోశాధికారిగా శ్రీనివాస్, కౌన్సిలర్ గా గౌరు విష్ణు తేజ, ఎన్నిక కాగా, తుది ఫలితాలు సెప్టెంబర్ 8వ తేదీన అధికార పూర్వకంగా తెలియజేయనున్నారు. ఈ సందర్భంగా కంచికచర్ల మండల పార్టీ అధ్యక్షులు కోగంటి బాబు అలియాస్ సత్యనారాయణ, టిడిపి నాయకులు బుడ్డి సూర్య ప్రకాష్, ఎంపీ చిన్నిని శాలువాతో సన్మానించి, అభినందనలు తెలియజేశారు.

ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో పాల్గొనడం

# ఆనందంగా వుంది

**ఏసిపి సుంకర మురళీమోహన్.**

**మైలవరం :** ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మైలవరం లో సేవా కార్యక్రమాలను యూనియన్ నాయకులు, సభ్యులు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మైలవరం డివిజన్ ఏసీపీ మురళీమోహన్ ఏపీయూడబ్ల్యూజే పాత్రికేయులకు శుభాకాంక్షలు తెలియజేశారు.మైలవరం ప్రభుత్వ ఆసుపత్రిలో కేక్ కట్ చేసిన ఏసీపీ శంకరం మురళీమోహన్, అనంతరం యూనియన్ నాయకులు, సభ్యులతో కలిసి రోగులకు రొట్టె, పండ్లు పంపిణి చేశారు. కార్యక్రమంలో పాల్గొని ఆసుపత్రి సూపరింటెండెంట్ జయప్రకాష్ తో పాటు పాల్గొన్నారు.పాత్రికేయుల కోసం ఏర్పాటు చేసుకున్న యూనియన్లు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఏసీపీ. శంకర.మురళీమోహన్ అన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ యు.వెంకట్రావు, పాత్రికేయ మిత్రులు మన్నె సాంబశివరావు, మన్నే శీను, జబ్బార్, రాజారెడ్డి, ఎర్రంశెట్టి రామకృష్ణ, ఇబ్రహీంపట్నం ఆంధ్ర ప్రభ జర్నలిస్ట్ డేవిడ్, బుద్ధవరపు వెంకట్రావు, కే ఎన్ వీ డీ ప్రసాదు, బాలు, వైడీపీ రెడ్డి, డేవిడ్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.



# రౌడీయిజం చేస్తే జిల్లా బహిష్కరణ తప్పదు

**ఆదోని వన్ టౌన్ సీఐ కె శ్రీరామ్ .**



**ఆదోని :** కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలో ఈరోజు ఆదోని వన్ టౌన్ సిఐ కే శ్రీరామ్, ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీసు, ఆదోని 1 టౌన్ పరిధిలో గల రౌడీ షీటర్స్ లకు కౌన్సిల్లింగ్ ఇవ్వడం జరిగినది. కౌన్సిల్లింగ్ లో బాగంగా స్టేషన్ పరిదిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనల కు తావివ్వరాదని, ప్రజల శాంతి భద్రతలకు భంగ%ళీ% కలిగించే విదంగా ప్రవర్తించరాదని, శాంతిభద్రతలకు వ్యతిరేఖంగా చేసే ఎలాంటి పనులైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అలా ఎవరైనా ప్రవర్తిస్తే వారికి అక్కడికక్కడే బహిరంగంగా కౌన్సిల్లింగ్ ఇస్తూ, వారిపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా పీడీ యాక్ట్ నమోదు చేసి జిల్లా నుంచి బహిష్కహరించబడును హెచ్చరించడం జరిగింది. రౌడీ షీటర్స్ అందరూ తమ నేర ప్రవుర్తిని మార్చుకుని మంచి ప్రవర్తనతో జీవనము సాగించి కుటుంబాన్ని పోసించుకోవాలని సూచనలు ఇవ్వడము జరిగినది.

# మార్కెట్ యార్డ్ కార్యదర్శిని వెంటనే సస్పెండ్ చేయాలి

**బిజెపి నాయకులు కునిగిరి నీలకంఠ .**

**ఆదోని :** మార్కెట్ యార్డ్ కార్యదర్శిని వెంటనే సస్పెండ్ చేయాలనీ బిజెపి నాయకులు కునిగిరి నీలకంఠ డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలో ఈరోజు ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ను సందర్శించి ధన్యాన్ని పరిశీలించడం జరిగింది. ఈ సంధర్భంగా మాట్లాడుతూ నిన్నటి రోజు 25 నిమిషాల పాటు కురిసిన వర్షానికి మార్కెట్ యార్డ్ లో అమ్మకానికి వేరుశనగలు తీసుకువచ్చిన రైతుల పంట తడిసి పోయింది.తడిసి పోయిన ధాన్యాన్ని పరిశీలిస్తూ దీనికి కారణం మార్కెట్ యార్డు సెక్రటరీ ది కాదా అని ప్రశ్నించారు.మార్కెట్ యార్డుకు కోట్ల ఆదాయం ఉన్న కనీస అవసరాలు కల్పించడంలో విఫలమైన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం కారణంగా వర్షపు నీరు మొత్తం ప్లాట్ఫామ్ మీద చేరుకొని అక్కడ ఉన్నటువంటి దాన్యం మొత్తం కూడా నీటిపాలైనదని రైతులు తెలియజేయడం జరిగింది.వర్షం వల్ల తడిసిపోయిన పంటను కొనుగోలు చేయాలని,మార్కెట్ యార్డు లో షెడ్ లు వేయించి,ఇలాంటి పరిస్థితి పునరావృత్తం కాకుండా చూడాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ నిరసన తెలియజేసింది.



# వైద్యురాలి మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి

**డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు.**

**అనంతపురం :** కలకత్తా లోని ఆర్జె కార్ మెడికల్ కాలేజ్ చెందిన ట్రైనింగ్ వైద్యురాలు మోమిత దెబ్ నాథ్ పై జరిగిన అత్యాచారం హత్యకు నిరసనగా అనంతపురం లోని పాత ఊరు లోని సిడి ఆసుపత్రి వైద్య అధికారులు వారి వైద్య సిబ్బంది నల్ల బ్యాడ్జిలను ధరించి గాంధీ సర్కిల్ వరకు నిరసన ర్యాలీని చేపట్టారు. అనంతరం ఆయుష్ సీనియర్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాడు తిరుపతి నాయుడు మాట్లాడుతూ ఆపదలో ఉన్న రోగులకు ప్రాణాపాయంలో ఉన్నవారికి వైద్య సేవలు అందించి నా ప్రాణం పోస్తున్న వైద్యులకే రక్షణ లేకుండా పోవడం బాధాకరమన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యులకు రక్షణ కల్పించాలని కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిందుతులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిడి ఆసుపత్రి వైద్యాధికారులు డాక్టర్ నవీన్, డాక్టర్ ప్రమోద్, నర్సింగ్ సూపర్డెంట్ లక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# సేవ్ హిందూస్ ఇన్ బంగ్లాదేశ్, జస్టిస్ ఫర్ మౌమిత డెబెంథ్

**హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ర్యాలీ**

**కూకట్పల్లి :** సేవ్ హిందూస్ ఇన్ బంగ్లాదేశ్ నినాదంతో కూకట్ పల్లి లో హిందూ సంఘాలు రోడ్డెక్కాయి. రిజర్వేషన్లపై బంగ్లాదేశ్ లో చెలరేగిన అల్లర్లు మతం రంగు పూసుకుని మైనార్టీలో ఉన్న హిందువులపై, హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను తక్షణమే ఆపాలని, హిందువులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ హిందూ సంఘాలు అన్ని ఏకమై కూకట్ పల్లి బిజెపి పార్టీ ఆఫీస్ వీధిలో జెండా సర్కిల్ దగ్గర నుంచి ర్యాలీ నిర్వహించారు. కూకట్ పల్లి జండా సర్కిల్లో మానవహారం ఏర్పాటు చేసి హిందువులను రక్షించాలని నినాదాలు చేస్తూ, ప్లే కార్డ్స్ పట్టుకొని జెండా సర్కిల్ దగ్గర నుంచి బజరంగ్ టెంపుల్, రామాలయం టెంపుల్, శివాలయం టెంపుల్, నైనా హాస్పిటల్ దగ్గర నుంచి మళ్లీ జెండా సర్కిల్ దగ్గర వారికి వచ్చి కొవ్వొత్తులను వెలిగించి ర్యాలీని ముగించారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి సీనియర్ పాత్రికేయులు తెల్ల హరికృష్ణ, కూతురు సురేష్ కుమార్, విష్ణు, గురుమూర్తి, డి బాలాజీ, యాదమ నాగేష్, ఎండి ఆదిల్, రాకేష్, కృష్ణ, మహేష్, శేఖర్, శ్రీను, మరియు కూకట్పల్లి జెండా సర్కిల్ అమావాస్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించే సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా



దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న వెస్ట్ బెంగాల్ కోల్కతా లోని ఆర్ జె కార్ మెడికల్ కళాశాల ఆసుపత్రి ఆవరణ లో 31సం ల పీజీ విద్యార్థిని పై పాశవికంగా జరిగిన అత్యాచార ఘటనకు నిరసనగా ఈ ర్యాలీని నిర్వహిస్తూ, ఈ సందర్భంగా తెల్ల హరికృష్ణ మాట్లాడుతూ "వైద్యో నారాయణో హరిః" మన దేశంలో వైద్యున్ని ఒక దైవం గా భావిస్తారు, నిస్వార్థం గా తమ ప్రాణాలను సైతం లెక్క చెయ్యకుండా కొవిడ్ లాంటి మహమ్మారి నుంచి ఈసమాజాన్ని కాపాడిన వైదులు దైవం తో సమానం అని, ఆ సమయం లో ఎందరో వైద్యులు తమ ప్రాణాలను సైతం కోల్పోయారని, అలాంటి ఒక గొప్ప వృత్తి లో ఉన్న డాక్టర్ ని కిరాతకం గా చిత్ర హింసలు పెట్టి మానభంగం చేసి చంపటం అనే ఈ అసాంఘిక ఘటన పట్ల సంతాపం తెలపటమే కాకుండా జండా సర్కిల్ వద్ద కొవ్వొత్తులను వెలిగించి సంతాపం తెలపటం జరిగింది.

## కోల్ కత్తా జూనియర్ వైద్యురాలు
# అత్యాచార ఘటనకు నిరసన

**ఎమ్మిగనూరు , ఆగస్టు 18, జర్నలిస్ట్ ఫైల్ :** ఎమ్మిగనూరు లోని ప్రభుత్వ ప్రయివేటు డాక్టర్ లు నిరసన ర్యాలీ చేపట్టారు..సంఘటనకు పూర్తిగా కేంద్ర, రాష్ట్ర








ప్రభుత్వాలు భాద్యత వహించాలనీ,, సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ట్రెయినీ వైద్యురాలు మౌమిత దిబనంథ్ హత్యాచార ఘటనను నిరసిస్తూ శనివారం ఎమ్మిగనూరు ప్రభుత్వ, ప్రయివేటు వైద్యుల అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. స్థానిక ఏరియా ఆసుపత్రి నుండి ర్యాలీ నిర్వహించారు ....అనంతరం సోమప్ప సర్కిల్ లో రాస్తారోకో నిర్వహించారు ఈ కార్యక్రమంలో సుమారుగా 500 మంది పైగా పాల్గొన్నారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్ గౌడప్ప గౌడ్ (శక్తి నర్సింగ్ హెూమ్ ) మాట్లాడుతూ అమాయకులైన ఆడపిల్లకు ఈ విధంగా జరగడం దురదృష్టకరమని జాతికే అవమానమని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోలీసు యంత్రాంగం నేరస్తులు ఎంతటి వారైనా సరే వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు అదేవిధంగా శిల్ప హాస్పిటల్ డాక్టర్ శిల్ప మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు అమ్మాయిలు మీద ఎన్నో గోరాలు జరుగుతున్న ప్రభుత్వంలో మార్పు రావడం లేదు అమ్మాయిలు మీద జాలి కనికరము లేని మృగాలను ఎంతటి వారైనా సరే వారిని కఠినంగా శిక్షించాలని మళ్లీ ఇటువంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కళ్ళలో నీరు పెట్టుకున్నారు డాక్టర్ ప్రసంగానికి ప్రజలలో కొద్దిసేపు నిశ్శబ్ద వాతావరణం నెలకొంది అదేవిధంగా డాక్టర్ మాలకొండయ్య ఇటువంటి సంఘటనలు చాలా బాధాకరమని దీనికి కారణము తల్లిదండ్రుల నిర్లక్ష్యము వారి మీద శ్రద్ధ లేకపోవడం ఇటువంటి సంఘటన జరగకుండా తల్లిదండ్రుల బాధ్యత కూడా ఉండాలని అవసరమని తెలియజేశారు

# దోషులను కఠినంగా శిక్షించాలి
### వైద్యధికారి శివ కార్తీక్ రెడ్డి

**గుంతకల్ :** కోల్‌కతా లోని ఆర్ జి కార్ హాస్పిటల్, మెడికల్ కళాశాల ట్రైనీ డాక్టర్ మోమిత దెబ్ నాథ్ ని అత్యాచారం చేసి హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని నేడు దేశవ్యాప్తంగా డాక్టర్లు సమ్మెను ప్రకటించారు. అందులో భాగంగా పామిడి పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివ కార్తిక్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ ని సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి అంబేద్కర్ సర్కిల్ మీదుగా కొత్త బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ శివ కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని, వైద్యులకు ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని, అప్పుడే స్వేచ్ఛ వాతావరణం లో వైద్యం చేయగలుగుతామని, ప్రాణంపోసే మాపై దాడులు చేయడం ఏంటని మండిపడ్డారు. డాక్టర్ల రక్షణ కోసం కఠినమైన చట్టాలను రూపొందించాలని ప్రభుత్వాలను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు, ఆర్.ఎం.పి వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు మహేష్ కుమార్, కమలాదర్, రాఘవేంద్ర రేడ్డి, కిరణ్ మయి, పద్మావతి,ఆర్.ఎం.పి వైద్యులు నాగమల్లారెడ్డి, బాషా, మురళి, ప్రభుత్వ వైద్య సిబ్బంది సుధారాణి, లక్ష్మీనారాయణమ్మ,రోహిణి, మమత, కవిత, లీలావతి, శివ కృష్ణ, సత్యనారాయణ, నరసింహ, రాజశేఖర్, రియాజ్, రామస్వామి నాయిక్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.




## విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**బొబ్బిలి :** ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం,బొబ్బిలి కార్యాలయంలో సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు రౌతు రామమూర్తి,యూనిట్ అధ్యక్షులు కర్రి సత్యనారాయణ,బొత్స సత్యనారాయ ణ, చుక్క రామమూర్తి,జిల్లా జనరల్ సెక్రటరీ రెడ్డి కృష్ణమూర్తి నాయుడు, పోల సత్యం నాయుడు,తవిటయ్య మరిశర్ల,బొత్స రామారావు తదితర సభ్యుల ఆధ్వర్యంలో, శ్రీకాకుళం జేమ్స్ ఆసుపత్రివారు నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో, మెగా వైద్యశిబిరం నిర్వహిం చడం జరిగింది.అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు జరిపించి మందులు అందజేశారు.

## కుల,మత బేధం లేకుండా జరుపుకునే పండుగ రాఖీ
### ప్రిన్సిపాల్ సులోచన.
**సోదర భావాన్ని పెంపొందించేలా శ్రీ సాయి పబ్లిక్ స్కూల్ లో రాఖీ వేడుకలు**

**నడిగూడెం :** మండల కేంద్రంలోని శ్రీ సాయి పబ్లిక్ స్కూల్లో శనివారం ముందస్తు రాఖీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బుస్సా సులోచన మాట్లాడుతూ... కుల,మత ప్రాంతీయ భేదం లేకుండా , అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతికగా జరుపుకునే పెద్ద పండుగ రాఖీ అని అన్నారు. ప్రతి విద్యార్థిని, విద్యార్థి పాఠశాల లో సోదర భావం తో కలిసి,మెలిసి చదువుకోవలన్నారు. అంతకు ముందు పాఠశాల లో సామూహిక రాఖీ వేడుకలు నిర్వహించారు. విద్యార్థినిలు, విద్యార్థులకు రాఖీ కట్టి స్వీట్ తినిపించుకున్నారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ఉపాధ్యాయులు వీరయ్య, సైదులు, హర్ష, లక్ష్మి, మల్లిక, కరుణ, రమ్య, వైదేహి, నాగమణి, రజియ,కుమారి, దీన,జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.



# ప్రకృతి వ్యవసాయం చేయండి,భూసారాన్ని పెంచండి : డిపియం

**కోవెలకుంట్ల , ఆగస్టు 18, జర్నలిస్ట్ ఫైల్ :** ఈరోజు కోయిలకుంట్ల డివిజన్ సంజామల మండలం లో రెడ్డిపల్లి గ్రామం మరియు తేళ్లపురి గ్రామంలో మహిళా రైతు జె.వనిత ప్రకృతి వ్యవసాయం 5 సంవత్సరాల నుండి 3.00 ఎకరాల పొలాల్లో 3 ఎకరాలు పి.యం.డి.ఎస్ మరియు 28.00 ఎకరాలు పంటలు డి.పి.యం ఫీల్డ్ విజిట్ చేయడం జరిగిందీ ఇందులో ,డ్రాగన్ ఫ్రూట్ ,దానిమ్మ,బత్తాయి, నిమ్మ, అరటి, మామిడి, నేరేడు, ఆపిల్, బేర్, జామ, సీతాఫలం, బీరా, మట్టికాయ ,మునగా, కంది, వంకాయ, బెండ ,28.00 ఎకరాల పొలంలో అన్ని రకాల పంటలు వున్నాయి డి. పి యం. మార్కెటింగ్ చేసుకొనే విధానం గురించి ప్రకృతి వ్యవసాయ విధానాల గురించి, మొక్కల పెరుగుదల కు కావలసిన పోషకాలు గురించి పలు రకాల పంటలు వేసుకోవడం వలన కలిగే ఉపయోగాలు గురించి వివరించడం జరిగింది . ఏ.రామకృష్ణ పి.వి సుబ్బారాయుడు యం.టి ,కోవెలకుంట్ల డివిజన్, ఎల్ 2.ఎల్ 3 ఎన్.ఎఫ్ తదితరులు పాల్గొన్నారు.




## వాయిదా పడిన చైర్మన్ పదవులు
# మళ్లీ నూతనంగా ఎన్నిక

**ఎమ్మిగనూరు , ఆగస్టు 18, జర్నలిస్ట్ ఫైల్ :** బనవాసి గ్రామంలో మండల ప్రాథమిక పాఠశాల లో గతంలో వాయిదా పడిన చైర్మన్ వైస్ చైర్మన్ పదవు లు ఈరోజు మళ్ళీ ఎన్నుకోవడం జరిగింది మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలనందు ఇన్చార్జ్ హెడ్ మాస్టర్ నాగేంద్రమణి ఆధ్వర్యంలో విద్యా కమిటీ చైర్మన్ కె. రవికుమార్ ఆచారి వైస్ చైర్మన్ కురవ రవికుమార్ నియమితులయ్యారు పిల్లల తల్లిదండ్రుల సమక్షంలో జరిగాయి ఎలాంటి రాజకీయం లేకుండా న్యూట్రల్ గా ఎన్నుకున్నారు పాఠశాల అభివృద్ధి కొరకు అవసరమని ఎన్నుకోవడం జరిగింది. గ్రామ పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొని విద్యా కమిటీ చైర్మన్ ల పదవుల దక్కాయి కమిటీ చైర్మన్ వైస్ చైర్మన్ కోసం ప్రధానోపాధ్యాయురాలు ప్రతిజ్ఞ చేశారు. పిల్లల తల్లిదండ్రులు పాఠశాల ఉపాధ్యాయులు నాగేంద్ర మని భారతి మంజులత పాల్గొన్నారు





## పి ఎస్ యు విద్యార్థి సంఘం పోరాటం ఫలితంగా
## నందవరం మండలం గ్రామల విద్యార్థులకు
# ఆర్టీసి బస్సు సౌకర్యం ఏర్పాటు
**పి ఎస్ యు జిల్లా కార్యదర్శి సురేష్**

**నందవరం, ఆగస్టు 18, జర్నలిస్ట్ ఫైల్ :** ఈ ఉద్యమానికి సంహరించిన డిఎం గారికి మీడియా మిత్రుల కు అభినందనలు ఎమ్మిగనూరు పట్టణం పరిధిలోని నందవరం మండలం గ్రామాల విద్యార్థులకు ప్రగతిశీల విద్యార్థి సంఘం (పి ఎస్ యు) కృషి పోరాటం ఫలితంగా పూలచింత గంగవరం పెద్దకొత్తిలి చిన్నకొత్తిలి గ్రామల విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు అయ్యిందని ఆయా గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఈ కార్యక్రమన్ని ఉద్దేశించి పి ఎస్ యు జిల్లా కార్యదర్శి సురేష్ వారు మాట్లాడుతూ విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక గతంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురి అయ్యారు ఈ గ్రామాలకు బస్సు కావాలని ఉద్యమం పోరాటం చేయగా అధికారులు డిఎం,ఆర్ఎం స్పందించి బస్సును వేస్తున్నందుకు అధికారులకు మరియు ఉద్యమనికి సహకరించిన మీడియా మిత్రులకు అభినందనలు తెలియజేస్తూ. అదేవిధంగా విద్యార్థులు ఈ ఆర్టీసీ బస్సు సౌకర్యన్ని వినియోగించుకోవాలి ఆయా గ్రామాల విద్యార్థులు సుమారు 100మంది పైగా దాక ప్రతి రోజు ఉన్నత చదువులు చదుకోవడనికి నందవరం ముగతి ఎమ్మిగనూరు స్కూల్స్,కాలేజీలకు వెళ్తున్నారని తెలియశారు విద్యార్థులు సరైన సమయానికి వెళ్లి చక్కగా చదుకోవలని ఏమైనా విద్యార్థులు సమస్యలు వుంటే మా దృష్టికి తెలియజేయవచ్చు అని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎం అమర్నాథ్ గారు పూలచింత యువ నాయకులు మఠం రాజశేఖర్ గారు మరియు విద్యార్థులు విష్ణు భూపాల్ పాల్గొన్నారు.




## ఎమ్మిగనూరు లో ఘనంగా ఏపియుడబ్ల్యూజె
# 67వ వార్షికోత్సవేడుకలు
**అనాథ ఆశ్రమం లో నిత్యావసర వస్తువులు పంపిణీ**
**గాంధీ, అంబేద్కర్ ,సోమప్ప లకు ఘన నివాళి... జెండా ఆవిష్కరణ**

**ఎమ్మిగనూరు, ఆగస్టు 18, జర్నలిస్ట్ ఫైల్ :** కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణం లో ఏపియుడబ్ల్యూజె ఆధ్వర్యంలో ఏపియుడబ్ల్యూజె 67 వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ( ఏపియుడబ్ల్యూజె ) తాలూకా అధ్యక్షులు బీ శ్రీనివాసనాయుడు, ప్రధాన కార్యదర్శి చిన్నఆకుల నాగరాజు,పట్టణ అధ్యక్షుడు జీబీ పరమేశ్వర ,జిల్లా ఉపాధ్యక్షుడు జాలవాడి బాషా,సహాయ కార్యదర్శి నూర్ అహ్మద్ హాజరయ్యారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణ నుండి ర్యాలీ గా వెళ్లి మహాత్మ గాంధీ,బీఆర్ అంబేద్కర్, మాచాని సోమప్ప విగ్రహాలను పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సోమప్ప సర్కిల్ లో ఏపియు డబ్ల్యూజె జెండాను న్యాయ సలహాదారులు అష్రఫ్,దేవేంద్ర రెడ్డి ఎగురవేశారు. ముఖ్య అతిథిగా మల్లెల గ్రూప్ చైర్మన్,సామాజికవేత్త మల్లెల అల్ ఫ్రైడ్ రాజు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు ఏ ఫలితాన్ని ఆశించకుండా సైనికులు గా పనిచేసే పనిచేసే పాత్రికేయులు కీలకమైన వ్యక్తులని కొనియాడారు అలాగే అనాధ ఆశ్రమం లో నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపియుడబ్లుజే నాయకులు శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ 66 సంవత్సరాల నుండి ఏపీయూడబ్ల్యూజే అలుపెరుగని పోరాటం చేస్తూనే ఉందని ఈరోజు సమాజంలో విలేకరులు వ్యక్తులుగా గుర్తించబడడానికి పునాదులు వేసిన గొప్ప ఉద్యమ విలువలు కలిగిన అదేవిధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కూడలిలో తనదైన శైలితో ఈరోజు విలేకరుల తరపున విజయ బేరి మోగించిన ఏపీయూడబ్ల్యూజే కి ఉద్యమజే జేలు తెలియజేస్తూ విలేకరుల సమస్యల కోసం నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటామని విలేకరుల పక్షాన ఎప్పుడువారికీ అండగా ఉంటామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో వి .రామకృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి 99 టివి ఈరన్న, ఖాశీమ్, బాబురాజు, మక్బుల్, అశోక్, శివ ,జగదీష్, ఆవుల శ్రీనివాసులు, సోమన్న, తిరుమల వెంకటేష్, సీ నాగరాజు, కె.నరసింహులు, జీ రవికుమార్,బాలాజీ, ఉపేంద్ర రెడ్డి, భీమా శేఖర్, నరసింహ రెడ్డి, గోవిందు, వెంకటాపురం నాగరాజు,గుడికల్లు యం లక్ష్మన్న (మౌర్య టైమ్స్ ) అబ్దుల్లా,స్టార్ టుడే యల్లయ్య,అనిల్, సూర్యఉదయం రాజు , మహేశ్వర రెడ్డి, సి ఈరన్న, గాజుల వెంకటేష్,హరి, వి .రవి, ఏనుగబాల రాజు, , ప్రసాద్,రహిమాన్,రంగన్న, సునీల్ కుమార్, రాజశేఖర్, చిన్న, ప్రింట్ మీడియా ఎలక్ట్రానిక్ మీడియా తదితరులు పాల్గొన్నారు.







## కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులను పంపిణీ

**పటాన్ చెరు :** జిన్నారం మండలం జిన్నారం గ్రామంలో రైతు వేదిక కేంద్రంలో తాసిల్దార్ బిక్షపతి తాజా మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వద్దే కృష్ణ కళ్యాణ లక్ష్మి చెక్కులను జిన్నారం గ్రామానికి చెందిన లబ్ధిదారులకు అందజేయడం జరిగింది. ఆడపిల్లల వివాహాలకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కళ్యాణ లక్ష్మి చెక్కులను కుటుంబాలకు అండగా ఆర్థికంగా లబ్ధి చేరాలని మహిళల వివాహాలకు అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోటేష్ వెంకటేష్ కోరబోయిన నరేష్ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు యనగండ్ల నరేందర్ బాల్ రెడ్డి ఎరవలి ప్రవీణ్ మల్లేష్ యాదవ్ నాయకులు పాల్గొన్నారు

## ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న జీనియస్ గ్లోబల్ స్కూల్ యాజమాన్యంపై
# క్రిమినల్ కేసులు నమోదు చేయాలి
**విద్యార్థి సంఘాలు రోడ్డుపై బైఠాయింపు**

**గోనెగండ్ల , ఆగస్టు 18, జర్నలిస్ట్ ఫైల్ :** మండలంలో ఉన్నటువంటి జీనియస్ గ్లోబల్ పాఠశాలను సీజ్ చేయాలని విద్యార్థి సంఘం నాయకులు శేఖర్ నాయుడు ,రాజేష్ ,ఉదయ్ ,సోమశేఖర్ , మద్దిలేటి, మునిస్వామి ,మహేంద్ర ,వీరేష్ యాదవ్ ,నరసన్న యాదవ్ , హుసేని మాట్లాడుతూ గోనెగండ్ల లోని జీనియస్ గ్లోబల్ పాఠశాల ప్రభుత్వ నిబంధనకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పాఠశాల ముందు రోడ్డుపైన అరగంట పాటు రాస్తారోకో చేసి పాఠశాలలు సీజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు మరియు విద్యార్థుల దగ్గర వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తూ రవాణా సౌకర్యం కొరకు ఫిట్నెస్ లేని బస్సులను ఏర్పాటు చేసుకొని టాటా సుమో ఏర్పాటు చేసుకుని విద్యార్థులను అధిక సంఖ్యలో ఎక్కించుకొని పాఠశాలకు తీసుకెళ్తూ విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించకుండా రేకుల షెడ్లలో తరగతులు ఏర్పాటు చేసి విద్యార్థులకు విద్యను బోధించడానికి క్వాలిఫైడ్ టీచర్స్ ను కూడా ఏర్పాటు చేయకుండా ఇంటర్ డిగ్రీ చదివినటువంటి టీచర్లను నియమించి నాణ్యత లేని విద్యను అందిస్తూ ధనార్జన ధ్యేయంగా పాఠశాల నిర్వహిస్తూ నిలువు దోపిడీ చేస్తున్నారని అలాగే పాఠశాల ప్రక్కనే పెట్రోల్ బంకు ఉండడం ద్వారా విద్యార్థులకు భవిష్యత్తులో ఒక పెద్ద ప్రమాదంగా ఉన్నటువంటి జీనియస్ గ్లోబల్ పాఠశాలను సీజ్ చేసి పాఠశాల యాజమాన్యం పై క్రిమినల్ కేసులు నమోదు చేసి పాఠశాలను సీజ్ చేయాలని విద్యార్థి సంఘాలుగా డిమాండ్ చేస్తున్నాం ఈ పాఠశాలపై మండల జిల్లా విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి విద్యార్థుల ప్రాణాలు కాపాడాలని డిమాండ్ చేస్తున్నాం ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు రాజు ,కిరణ్ ,మంజు, మనోహర్ నాగేష్ తదితరులు పాల్గొన్నారు




# సింగరేణి విశ్వవ్యాప్తంగా విస్తరించాలి

● మెటల్స్, నాన్ మెటల్స్ మైనింగ్‌లో అడుగు పెట్టాలి ● లిథియంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**జర్నలిస్ట్ ఫైల్**/ హైదరాబాద్ : సింగరేణి సంస్థ దేశ స్వాతంత్రం కంటే ముందు నుంచీ ఉన్న సంస్థ అని, ఎంతో నిష్ణాతులైన, సుశిక్షితులైన సిబ్బంది ఉన్న సంస్థకావడంతో పాటు బొగ్గు ఉత్పత్తిలో తిరుగులేని నైపుణ్యం ఉన్న సింగరేణి ఇతర మైనింగ్ రంగాల్లోకి విస్తరించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. శనివారం బాబా సాహెబ్ అంబేద్కర్ సచివాలయంలో సింగరేణి సంస్థ భవిష్యత్ ప్రణాళిలు, అభివృద్ధిపై జరిగిన సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్, బొగ్గు వంటి సాంప్రదాయ ఇంధన వనరులకు కాలం చెల్లుతోందని, భవిష్యత్ అంతా విద్యుత్ బ్యాటరీలే కేంద్రంగా మారబోతున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో లిథియం వంటి అనేక మూలకాల అన్వేషణ, వాటిని వెలికి తీయడంపై సింగరేణి దృష్టి సారించాలని చెప్పారు.



సింగరేణి సంస్థ తన మనుగడను కొనసాగిస్తూ ఆస్తులను, సంపదను సృష్టించుకోవాలని సూచించారు. తద్వారా రాష్ట్ర ప్రజల సంపదైన సింగరేణి ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన జరుగుతుందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. సింగరేణి సంస్థ మెటల్స్, నాన్ మెటల్స్ మైనింగ్ లో ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలన్నారు. ఇందుకోసం అవసరమైతే ఒక కన్సల్టెన్సీని నియమించుకోవాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గ్రీన్ ఎనర్జీలో భాగంగా రాష్ట్రంలో ఫ్లోటింగ్ సోలార్, పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రికి సింగరేణి అధికారులు వివరించారు. ఇందుకు సంబంధించి పూర్తి డీపీఆర్ లు రూపొందిస్తున్నామని, త్వరలోనూ వాటిని ప్రభుత్వానికి అందిస్తామని తెలిపారు. ఒరిస్సాలోని నైనీ బ్లాక్ లో బొగ్గు ఎప్పటి నుంచి ఉత్పత్తి ఆరంభిస్తారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరా తీశారు. ఈ సమీక్షా సమావేశంలో ఎనర్జీ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఉప ముఖ్యమంత్రి స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, సింగరేణి సిఎండీ బలరామ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.




# బోర్డు తిప్పేసిన మరో సాఫ్ట్‌వేర్ కంపెనీ

● ట్రైనింగ్ పేరుతో రూ.10 కోట్లకు టోకరా ● బాధిత నిరుద్యోగులు లబోదిబో ● మాదాపూర్ పోలీసులను ఆశ్రయించిన వైనం

**జర్నలిస్ట్ ఫైల్**/హైదరాబాద్ : హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో మరో సాఫ్ట్ వేర్ కంపెనీ బోర్డు తిప్పేసింది. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అయ్యప్ప సొసైటీ 100 ఫీట్ రోడ్ లో 'ఫ్రైడే అప్ కన్సల్టెన్సీ' పేరుతో కంపెనీని కేటుగాళ్లు నిర్వహించారు. కన్సల్టేషన్ కంపెనీ దాదాపు 600 మందికి పైబడిన నిరుద్యోగుల నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసింది. ఒక్కొక్కరి నుంచి రూ.1లక్ష, రూ. 50,000 వేల చొప్పున వసూళ్లకు పాల్పడింది. శిక్షణ ఇచ్చి జాబులు పేరిట సదరు కంపెనీ ప్రతినిధులు నమ్మించి మోసానికి తెగబడ్డారు. శిక్షణ అనంతరం ప్లేస్మెంట్ సైతం ఇప్పిస్తానంటూ నమ్మించి కుచ్చు టోపీ పెట్టారు. ఈ కంపెనీకి హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, విజయవాడ కేంద్రాలుగా మరిన్ని బ్రాంచ్‌లు ఉన్నట్లు తెలుస్తోంది. బాధితుల నుంచి సుమారు రూ.10 కోట్లు వసూళ్లు చేసిన సదరు కంపెనీ. ఉన్నపళంగా కార్యాలయానికి తాళం వేసింది. మొత్తం రూ.10కోట్లు వసూలు కాగానే రాత్రికి రాత్రికి బోర్డు తిప్పేశారు. శనివారం ఉదయం ట్రైనింగ్ కోసం వెళ్లిన నిరుద్యోగులు తాళా లు వేసి ఉండటాన్ని చూసి అవాక్కయ్యారు. దీంతో తాము మోసపోయామని గ్రహించిన బాధితులు మాదాపూర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గత కొంతకాలం నుంచి నిరుద్యోగులకు కంపెనీ శిక్షణ ఇచ్చినట్లు బాధితులు వెల్లడించారు. దీని నమ్మి చాలా మంది నిరుద్యోగులు మోసపోయారు. మేనేజర్, ఉన్నత స్థాయి ఉద్యోగులెవరూ కాంటాక్ట్‌లో లేరు. మా డబ్బులు తిరిగి ఇవ్వాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఉన్నత స్థాయి ఉద్యోగులు, యజమాని దొరికితేనే పూర్తి విషయాలు బయటకు వస్తాయని పోలీసులు చెప్పారు. ఇప్పటి వరకు కంపెనీకి సంబం ధించి ఎలాంటి సమాచారం అందుబాటులో లేవని పోలీసులు పేర్కొన్నారు. యజమాని, మేనేజర్‌కు ఫోన్ చేస్తే సమాధానం లేదని అన్నారు. అయితే, అప్పుల తెచ్చి మరీ ఫీజులు చెల్లించామని, మంచి కంపెనీ ల్లో ప్లేస్మెంట్ ఇస్తామంటూ దారుణంగా మోసం చేశారంటూ బాధితులంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# దసరా నుండి స్కిల్ యూనివర్సిటీలో కోర్సుల ప్రారంభం

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

**జర్నలిస్ట్ ఫైల్**/ హైదరాబాద్ : ముఖ్యమంత్రి ఆలోచనల మేరకు రూపు దిద్దుకున్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ద్వారా పలు రంగాల్లో కోర్సులను దసరా పండగ నుండి ప్రారంభిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వెల్లడించారు. స్కిల్ యూనివర్సిటీ ద్వారా దాదాపు 20 కోర్సులను నిర్వహించాలని గుర్తించడం జరిగిందని, వీటిలో దసరా పండగ నుండి ప్రాథమికంగా ఆరు కోర్సులను ప్రారంభించాలని నిర్ణయించినట్టు తెలిపారు ఈ స్కిల్ యూనివర్సిటీ ప్రారంభం, విధి విధానాల ఖరారు, కోర్సుల ప్రారంభం తదితర అంశాలపై నేడు ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక, పరిశ్రమల శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామ కృష్ణారావు, జయేష్ రంజన్, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ముఖ్యమంత్రి కార్యాలయ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, టిజిఐఐసి ఎండీ విష్ణు వర్ధన్ రెడ్డి, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొ. వెంకట రమణ, శ్రీనిరాజు, వీవీఎల్ఎస్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ ముచ్చర్ల వద్ద కేటాయించిన 57 ఎకరాల స్థలంలో ఈ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారని, ఈ నిర్మాణ పనులు ముగిసేంతవరకు ఈ యూనివర్సిటీని తాత్కాలిక భవనంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందుకు గాను ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా గానీ, నాక్ లేదా నిథమ్ లో నిర్వహించనున్నట్టు



చెప్పారు. ఇప్పటికే ఈ యూనివర్సిటీ చైర్‌పర్సన్ గా ఆనంద్ మహేంద్రను, శ్రీనివాస రాజు ను కోచైర్మన్ గా నియమించడం జరిగిందన్నారు. ఈ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో దాదాపు 140 కంపెనీలు భాగస్వామ్యం కావడానికి ఆసక్తి చూపుతున్నాయని, దాదాపు 20 కోర్సులను ప్రారంభించేందుకు ప్రణాళికలు రూపొందించగా, తొలుత స్కూల్ ఆఫ్ ఈ కామర్స్, లాజిస్టిక్స్ రిటైల్ విభాగంలోనూ సర్టిఫికెట్ కోర్సులు, డిప్లొమా కోర్సులను ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు. వివిధ విభాగాల్లో శిక్షణ నిమిత్తం దేశంలోని ప్రముఖ కార్పొరేట్ సంస్థలైన ఎస్‌బిఐ, ఎన్‌ఏసీ , డాక్టర్ రెడ్డీస్ , టీవీఏజీఏ, అదానీలు భాగస్వాములుగా ఉండేందుకు అంగీకరించారని, వీరితో పాటు సిఐఐ కూడా ముందుకు వచ్చిందని వెల్లడించారు. ఈ యూనివర్సిటీకి సంబంధించిన లోగో ను, వెబ్‌సైట్ ను ప్రారంభించేందుకు తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ యూనివర్సిటీలో కోర్సు పూర్తి చేసిన వారికి ఆకర్షణీయమైన వేతనంతో కూడిన ఉద్యోగ కల్పనకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు.

# కాళేశ్వరంలో ఎలాంటి అవినీతి జరగలేదు

వెదిరి శ్రీరామ్ తప్పుదోవ పట్టిస్తున్నారు

కమిషన్‌కు వివరించిన ప్రకాష్

**జర్నలిస్ట్ ఫైల్**/హైదరాబాద్:గోదావరి నదిపై నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల సాగునీటి పథకంలో ఎటువంటి అవినీతి జరగలేదని రాష్ట్ర జలవనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వి.ప్రకాష్ వెల్లడించారు. మేడిగడ్డతోపాటు కాళేశ్వరం ప్రాజెక్టులపై విచారణ జరుపున్న జస్టిస్ ఘోస్ కమిటీ ఎదుట ప్రకాష్ హాజరయ్యారు. పలు విషయాలను కమీషన్‌కు వివరించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మీడియాతో మాట్లాడుతూ తాను కాళేశ్వరం కమిషన్ ముందు మాజీ చైర్మన్‌గానే హాజరయ్యానని తెలిపారు. తన అభిప్రాయాలను కమిషన్ ముందు వెల్లడించానని తెలిపారు. తెలంగాణ భవిషత్ కోసం అన్ని ప్రాజెక్టులను కేసీఆర్ రీ డిజైన్ చేశారన్నారు. తుమ్మిడిహేట్టి బ్యారేజ్ కట్టాలని కెసిఆర్ మదిలో ఉండేది కానీ మహారాష్ట్ర దానికి ఒప్పుకోలేదని తెలిపారు. స్టోరేజ్ లేకపోవడం వల్ల తుమ్మిడిహేట్టి నిర్మాణం ఆలోచన ముందుకు వెళ్ళలేదన్నారు.సిడబ్ల్యూసీ చెప్పినట్లుగా 164 టీఎంసీల నీటిలో 64 టీఎంసీలు తెలంగాణ వి కాదు అని ఆ రిపోర్టులో నే ఉందన్నారు. వేదిరి శ్రీరామ్ లాంటి వాళ్ళు కమిషన్ను తప్పుదోవ పట్టిస్తున్నారు. వార్ధానది బ్యారేజి రూ. 2500 కోట్లతో నిర్మాణం అవుతుందని,తుమ్మిడిహేట్టి ప్రాజెక్టుకు రూ.7500 ఖర్చు అవుతుందన్నారు.వి షెప్ లో బ్యారేజి కట్టడం సాధ్యం కాదు అందుకే కట్టలేదని తెలిపారు. తుమ్మిడిహేట్టి వద్ద 54 టీఎంసీల నీటి లభ్యతనే ఉంటుందని కమీషన్‌కు ఆధారాలు చూపించానని తెలిపారు. కృష్ణ, గోదావరి బేసిన్ లో ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 17లక్షల ఎకరాలకు నీళ్లు అందించడం జరిగిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు లో ఎలాంటి అవినీతి జరగలేదని నోట్ రూమ్ లో కమిషన్ కు ఇచ్చానని తెలిపారు. తాను కమిషన్ ముందు చెప్పిన వాటిని అఫిడవిట్ రూపంలో ఇవ్వాలని అన్నారని, మళ్ళీ ఈ నెల 26న సాక్ష్యాలతో కమిషన్ కు ఆధారాలు ఇస్తానని వెల్లడించారు.

# ఒట్టేసి చెబుతున్నా.. అర్హులకే రుణ మాఫీ

విలేకరులతో మల్లు రవి

**జర్నలిస్ట్ ఫైల్**/హైదరాబాద్:'దేవుడు మీద ఒట్టేసి చెబుతున్నా' అర్హులకే రుణ మాఫీ చేస్తామని కాంగ్రెస్ ఎంపి మల్లు రవి అన్నారు. రెండు లక్షల లోపు ఉన్న వారికే రుణాలు మాఫీ చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎవరికైనా రుణ మాఫీ కాకుంటే ఆ ఫిర్యాదులను పరిష్కారం చేస్తామన్నారు. బిఆర్ఎస్ తరహాలో రియల్ ఎస్టేట్ భూములకు రుణమాఫీ చేయమని ఆయన తెలిపారు. బండి సంజయ్ మాటలు వింతగా ఉన్నాయని, కెటిఆర్‌కు పిసిసి పదవి అని బండి సంజయ్ అనడంలో అర్థం ఉందా?, కాళేశ్వరంపై విచారణ జరుగుతోందని, ఎవరికైనా చట్ట ప్రకారమే శిక్షలు పడతాయన్నారు. తెలంగాణకు వెనుకబడిన ప్రాంతాల నిధుల కింద రూ.1800 కోట్లను కేంద్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



## రింగ్ రోడ్ నిర్మాణానికి భూములు ఇవ్వం

ఆర్‌డిఓ కార్యాలయం ముందు భూ బాధితుల ధర్నా

**జర్నలిస్ట్ ఫైల్**/సంగారెడ్డి బ్యూరో: రీజినల్ రింగ్ రోడ్ కోసం తాము భూములు ఇచ్చే పరిస్థితి లేదని, తమ ప్రాణాలు పోయినా భూములు మాత్రం ఇవ్వబోమని గిర్మాపూర్, పెద్దాపూర్ గ్రామాల రైతులు తేల్చిచెప్పారు. సంగారెడ్డి ఆర్‌డిఓ కార్యాలయంలో గిర్మాపూర్, పెద్దాపూర్ గ్రామాల్లో రీజినల్ రింగ్ రోడ్‌లో భూములు కోల్పోతున్న రైతులతో శనివారం సమావేశానికి ఆర్‌డిఓ ఆహ్వానించారు. కార్యాలయానికి వెళ్లిన ఆయా గ్రామాల రైతులు సమావేశాన్ని బహిష్కరించి బయటకు వచ్చారు. ఈ సందర్భంగా రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణానికి భూములను ఇవ్వబోమంటూ తీర్మానం చేసి రైతులు ఆర్‌డిఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. ఇప్పటికే నేషనల్ హైవే, ఫిల్టర్ బెడ్ నిర్మాణం, మంజీరా పైప్‌లైన్‌కు తమ గ్రామాల్లోని భూములను పూర్తిగా కోల్పోయామన్నారు. భూములు కోల్పోయి కూలీలుగా తమ జీవితాలు మారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు తుల్జారెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి జయరాజు, మంజీరా రైతు సమాఖ్య అధ్యక్షుడు పృథ్వీరాజ్, గిర్మాపూర్ మాజీ సర్పంచ్ మల్లేశం, తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, రైతులు జయరాములు, ప్రతాప్, రమేష్, ఆశోక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## 'అర్హత ఉన్నా రుణమాఫీ కాని రైతుల కోసం ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్'

ఎక్స్ వేదికగా ఆసక్తికర పోస్ట్ పెట్టిన తెలంగాణ కాంగ్రెస్

**జర్నలిస్ట్ ఫైల్**/హైదరాబాద్:రైతులకు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ గుడ్ న్యూస్ చెప్పింది. తాజాగా ఎక్స్ వేదికగా తెలంగాణ కాంగ్రెస్ ఆసక్తికర పోస్ట్ పెట్టింది. 'అర్హత ఉన్నా రుణమాఫీ కానీ రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తోంది. ఆధార్‌లో తప్పులుంటే దానికి బదులుగా ఓటరుకార్డు, రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, రేషన్ కార్డు లేకపోతే రైతు కుటుంబాల నిర్ధారణకు సర్వే నిర్వహిస్తారు. ఆధార్, బ్యాంకు ఖాతాల్లో తేడాలుంటే సరిచేసే పోర్టల్‌లో నమోదు చేయడంతో పాటు అసలు, వడ్డీ లెక్కలు సరిపోకపోతే నిర్ధారణ, దిద్దుబాటు చర్యలు, ఇంటింటికీ వెళ్లి ఫిర్యాదుల స్వీకరణ చేపట్టేలా కొత్తగా మార్గదర్శకాలు జారీ' అని కాంగ్రెస్ పోస్ట్ చేసింది. రాష్ట్రంలో మూడో విడతలో 2 లక్షల రైతు రుణమాఫీ ఇటీవల విడుదల చేసిన సంగతి తెలిసిందే. 14.45 లక్షల మంది రైతులకు మూడో విడతలో రాష్ట్ర ప్రభుత్వం రుణాలు విడుదల చేసింది. ఆగష్టు 15న నిధులు విడుదల చేసినా ఇంకా కొంతమందికి రుణమాఫీ కాలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ పార్టీ ఎక్స్ వేదికగా ఈ పోస్ట్ పెట్టింది.

## టి బిజెపి వ్యవహారాల ఇన్‌చార్జిగా అభయ్ పాటిల్

**జర్నలిస్ట్ ఫైల్**/హైదరాబాద్: తెలంగాణ బిజెపి వ్యవహారాల ఇన్ చార్జిగా అభయ్ పాటిల్‌ను బీజేపీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు అభయ్ పాటిల్ తన 'ఎక్స్' ఖాతాలో శనివారం పేర్కొన్నారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సత్తాచాటడమే లక్ష్యంగా పెట్టుకున్న బిజెపి అధిష్టానం తాజాగా ఈ కీలక నిర్ణయం తీసుకుందని తెలుస్తోంది. గడచిన లోక్ సభ ఎన్నికల్లో అభయ్ పాటిల్ తెలంగాణ ఇన్ చార్జిగా వ్యవహరించారు. ఈ క్రమంలో సోషల్ మీడియా ద్వారా యువతలో మంచి ఫాలోయింగ్ సంపాదించుకున్నారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికలతో పాటు లోక్ సభ ఎన్నికల్లో మెరుగైన ఓట్ పర్సెంటేజ్ సాధించిన బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో పక్కాగా ప్రణాళికలు వేయాలని భావిస్తోంది.

# పోలవరం ప్రాజెక్టు దస్త్రాలు దగ్ధం

● అధికారులే కాల్చేశారని ఆరోపణలు

**జర్నలిస్ట్ ఫైల్**/హైదరాబాద్ : ఏపిలో అధికారం కోల్పోగానే కీలకమైన దస్త్రాలను మంటలపాలు కావడం రివాజుగా మారింది. మొన్నటికి మొన్న మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో రెవెన్యూ శాఖకు సంబంధించిన దస్త్రాలు దహనం అయిపోయాయి. భూ అక్రమాలకు ఆధారాల్లేకుండా నిజాలకు నిప్పు పెట్టారు. ఆ ఘటనపై దర్యాప్తు సాగుతుండగానే ఇప్పుడు పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన దస్త్రాలు దగ్ధం కావడం తీవ్రస్థాయిలో కలకలం రేపుతోంది. నిప్పు లేనిదే పొగ రాదు అన్నట్లు ఏదైనా కిరికిరి ఉంటే తప్ప దస్త్రాలు కాల్చేయడానికి పెద్ద కారణాలు ఉండవు. ఈ పోలవరం ఫైల్స్‌లోనూ అదే స్పష్టమవుతోంది. వైసిపి నేతలు ఐదేళ్ల పాలనలో చేసిన అక్రమాలు బయటకు వస్తాయనే భయంతో దస్త్రాలు తగలబెట్టారని జోరుగా ప్రచారం సాగుతోంది. ధవళేశ్వరంలోని పోలవరం ప్రాజెక్టు పరిపాలనా కార్యాలయంలో దస్త్రాలు దగ్ధం కావడం చర్చనీయాంశమైంది. పోలవరం ఎడమ ప్రధాన కాలువ భూసేకరణ సంబంధించిన దస్త్రాలు దగ్ధమైనట్లు సమాచారం. లబ్ధిదారుల పరిహారం అక్రమాలు బయటకు వస్తాయనే కార్యాలయంలోని అధికారులే దస్త్రాలు కాల్చేశారని అనుమానం కలుగుతోంది. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు కాలిపోయిన దస్త్రాలను పరిశీలించారు. శుక్రవారం రాత్రి దస్త్రాలు తగలబెట్టి ఉంటారని అనుమానిస్తున్నారు. కాల్చివేసిన దస్త్రాలను ఇంఛార్జి సబ్ కలెక్టర్ శివ జ్యోతి, డిఎస్‌పి భవ్య కిషోర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పరిశీలించారు. సగం కాలిపోయిన దస్త్రాలను స్వాధీనం చేసుకొని పోలీసులు విచారణ చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు అందజేసిన పరిహారం సంబంధించిన దస్త్రాలుగా అధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనుమతి తీసుకోకుండానే శుక్రవారం రాత్రి కార్యాలయం సిబ్బంది దస్త్రాలు తగలబెట్టేశారని తెలుస్తోంది. ఫైల్స్ ఎందుకు కాల్చేశారు? అనే అంశాలపై అధికారుల బృందం ఆరా తీస్తోంది. దస్త్రాల దగ్ధంపై విచారణ చేస్తున్నట్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వేదవల్లి తెలిపారు. డిప్యూటీ కలెక్టర్ రెండ్రోజుల క్రితం లీవ్‌పై వెళ్లారని తనను ఇంఛార్జిగా నియమించినట్లు వెల్లడించారు. తనకు తెలియకుండా స్వీపర్ దస్త్రాలను కాల్చేశారని చెబుతున్నారు. వైసిపి అవినీతి, అక్రమాలు బయటకు వస్తాయనే పోలవరం ప్రాజెక్టు పరిపాలనా కార్యాలయం దస్త్రాలు దగ్ధం చేశారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. దీనికి బాధ్యులెవరో దర్యాప్తు ఎంత పెద్దవారైనా శిక్షిస్తామని అన్నారు.

### పోలవరం ఎడమ కాలువ ఫైళ్లు దగ్ధం కాలేదు: ఆర్డీవో

పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువకు సంబంధించిన ఫైళ్లు దవళేశ్వరంలోని పరిపాలన కార్యాలయం వద్ద దగ్ధం అయినట్లు మీడియాలో వచ్చిన వార్తలు కలకలం రేపాయి. దీనిపై ఆర్డీవో శివ జ్యోతి స్పందించారు. పోలవరం ఎడమ కాలువకు సంబంధించిన ఫైళ్లు దగ్ధం కాలేదని స్పష్టం చేశారు. సంతకాలు లేని పత్రాలు, జిరాక్స్ పేపర్లను మాత్రమే దహనం చేశారని వెల్లడించారు. అనుమతి లేకుండా ఎందుకు దహనం చేశారో విచారణ చేస్తామని ఆర్డీవో అన్నారు. శాఖాధిపతి సంతకాలు లేవు కాబట్టి, ఆ పత్రాలు ఏమంత ముఖ్యమైనవి కావని పేర్కొన్నారు. ధవళేశ్వరం లోని పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేషన్ కార్యాలయానికి కొత్త బీరువాలు వచ్చాయని, ఫైళ్లు సర్దే క్రమంలో అవసరం లేని వాటిని కాల్చారని ఆర్డీవో శివజ్యోతి వివరించారు. అయితే, అనుమతి లేకుండా ఫైళ్లు దహనం చేయడంపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## అభిషేక్ మను సింఘ్వీ చైర్మన్‌గా కాంగ్రెస్ లీగల్ సెల్ ప్యానెల్

**జర్నలిస్ట్ ఫైల్**/ హైదరాబాద్ : సీనియర్ కాంగ్రెస్ నేత, డా. అభిషేక్ మను సింఘ్వి చైర్మన్‌గా లీగల్ సెల్ ప్యానెల్‌ను కాంగ్రెస్ పార్టీ పునరుద్ధరించింది. పునరుద్ధరించిన ప్యానెల్‌ను ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే ఆమోదించినట్లు ఎఐసిసి ప్రధాన కర్యాదర్శి, ఎంపి కెసి వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. లీగల్ సెల్ సీనియర్ ప్యానెల్‌లో సల్మాన్ ఖుర్షీద్, వివేక్ టంఖా, హరిన్ రావల్, ప్రశాంతో సేన్, దేవదథ్ కామత్, కెటిఎస్ తుల్సి, విపుల్ మహేశ్వరీ, ఎగ్జిక్యూటివ్ ప్యానెల్‌లో మొహమ్మద్ అలీ ఖాన్ (కార్యదర్శి), అమన్ పన్వర్, ఒమర్ హోడా, ఈషా బక్షి, అర్జున్ శర్మ, నిశాంత్ మండల్, అమిత్ భండారి, తరున్నుమ్ చీమా, నింగోంబమ్ భుపేంద మీటీ, లల్‌నూన్‌లూయి రాల్టే, స్వాతీ డ్రైక్ సభ్యులుగా నియమితులయ్యారు.

# హైదరాబాద్‌లో ఆశ్రయం పొందిన ఐసిస్ ఉగ్రవాది అలీ

ఫరీదాబాద్ పోలీసుల విచారణలో వెల్లడి

**జర్నలిస్ట్ ఫైల్**/హైదరాబాద్ : దేశంలో ఎక్కడ ఉగ్రవాద దాడులు జరిగినా దాని మూలాలు హైదరాబాద్‌తో ముడిపడి ఉండటం సర్వసాధారణమైంది. హైదరాబాద్‌లో మరోసారి ఉగ్రవాద మూలాలు బయటపడ్డాయి. అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ ఐఎస్ఐఎస్‌కు చెందిన ఉగ్రవాది రిజ్వాన్ అలీని ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు ఫరిదాబాద్ సరిహద్దులో అరెస్ట్ చేశారు. న్యాయస్థానం అనుమతితో కస్టడీలోకి తీసుకున్న పోలీసులకు విచారణ చేయడంతో పలు సంచలన విషయాలు వెలుగుచూశాయి. రిజ్వాన్ అలీ యువతను ఉగ్రవాదం వైపు మళ్లించడంలో దిట్ట. సుమారు ఏడాది కాలంగా పరారీలో ఉన్న ఇతడిపై ఎన్ఐఎ రూ. 3 లక్షల రివార్డు ప్రకటించింది. రిజ్వాన్ కేరళతో పాటు హైదరాబాద్‌లోనూ తలదాచు కున్నట్లు విచారణలో వెల్లడించింది. నగరానికి చెందిన ఘోరీతో రిజ్వాన్ నిత్యం సంప్రదింపులు జరిపినట్లు తేటతెల్లమైంది. రాష్ట్ర నిఘా విభాగానికి ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ విషయం తెలిసిన వెంటనే హైదరాబాద్ నుంచి ఓ ప్రత్యేక బృందం హుటాహుటిన ఢిల్లీ బయలుదేరి వెళ్లింది. రిజ్వాన్ అలీ డిగ్రీ పూర్తి చేసిన తర్వాత 2015–2016 మధ్య ఆన్‌లైన్ నుంచి ఉగ్రవాద ప్రేరణ పొంది ఐఎస్ఐఎస్ బాటపట్టాడు. ఝార్ఖండ్ నుంచి ఢిల్లీ వచ్చి షహీన్ బాగ్‌కు చెందిన షాన్వాజ్ తో 2017లో పరిచయం పెంచుకున్నాడు. అతడి ద్వారా రిజ్వాన్ అలీ ఉగ్ర కార్యకలాపాలను ప్రారంభించాడు. ఉత్తర్ ప్రదేశ్, ఉత్తరఖండ్, ఝార్ఖండ్, మహారాష్ట్ర ఐఎస్ఐఎస్ మాడ్యూల్ విస్తరణతో పాటు నిధుల సేకరణకు పనిచేశాడు. పెద్ద సంఖ్యలో యువతను ఆన్‌లైన్ ద్వారా ఆకర్షించి ఉగ్రవాదం వైపు మళ్లించాడు. గతేడాది పుణె పోలీసులు షానవాజ్ మాడ్యూల్ గుట్టు రట్టు చేశారు. ఈ సందర్భంగా పలువురిని అరెస్ట్ చేశారు. ఈ పరిణామాలతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన రిజ్వాన్ ఉత్తర్ ప్రదేశ్ లోని సంభాల్‌లో తలదాచుకున్నాడు. ఇతడిని మోస్ట్ వాంటెడ్ గా గుర్తించిన ఎన్ఐఏ..రూ. మూడు లక్షల రివార్డు ప్రకటించింది. ఈ ఏడాది జనవరిలో రిజ్వాన్ కదలికలు గుర్తించిన ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు.. సంభాల్ లోని ఓ స్థావరంపై దాడి చేశారు. అప్పట్లో తృటిలో తప్పించుకున్న అతడు హైదరాబాద్ కు చేరుకున్నాడు. మారు పేరుతో సికింద్రాబాద్ లో దాదాపు ఆరు నెలలు ఉన్నాడు. ఇక్కడి నుంచి కేరళ వెళ్లిన రిజ్వాన్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో విధ్వంసం సృష్టించేందుకు కుట్రపన్నాడు. ఇందుకోసమే ఢిల్లీ వెళ్లిన అతడిని పోలీసులు అరెస్ట్ చేశారు.

## గాజాలో దాడులకు ఒకే కుటుంబంలో 18 మంది మృతి

**జెరుసలెం:** గాజాపై జరిగిన భీకర వైమానిక దాడుల్లో ఒకే కుటుంబానికి చెందిన 18 మంది మృతి చెందారు. ఈ దాడిలో వ్యాపారి సమీ జవాద్ అలీ ఎజ్లా, అతడి ఇద్దరు భార్యలు, 11 మంది పిల్లలు, వారి అమ్మమ్మ, మరో ముగ్గురు బంధువులు ప్రాణాలు కోల్పోయారని అల్ అక్సా ఆస్పత్రి ధ్రువీకరించింది. దీనిపై విచారణ జరుపుతున్నట్లు ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. కాల్పుల విరమణ ఒప్పందంపై ఇజ్రాయెల్, హమాస్ మధ్య చర్చలు అసంపూర్తిగా ముగిసిన వేళ గాజాపై ఈ దాడులు జరిగాయి.

# కోల్‌కతా హత్యాచార ఘటన.. రాష్ట్రవ్యాప్తంగా వైద్య సేవలు బంద్

**జర్నలిస్ట్ ఫైల్**/హైదరాబాద్: కోల్‌కతా వైద్యురాలి హత్యాచార ఘటన నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా వైద్యుల ఆందోళనలు మరింత ఉద్ధృతమయ్యాయి. నాలుగు రోజులుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు ఒపి సేవలు నిలిపివేయగా, ఇండియన్ మెడికల్ అసోసియేషణ్(ఐఎంఎ) పిలుపుతో శనివారం ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల వైద్యులు సైతం రోడ్డెక్కారు. రాష్ట్రవ్యాప్తంగా ఒపి సేవలు నిలిపివేసి ఆందోళనకు దిగారు. దీంతో ఆసుపత్రుల్లో అత్యవసర వైద్యం మినహా, మిగతా సేవలన్నీ నిలిచిపోయాయి. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులతో పాటు నిమ్స్, ఎంఎన్‌జె క్యాన్సర్ హాస్పిటల్, ఇఎన్‌టి, నీలోఫర్, ఇఎస్ఐ, సరోజిని దేవి కంటి ఆసుపత్రితో పాటు బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి, యశోద హాస్పిటల్ ఎదుట వైద్యులు నిరసనలు చేపట్టారు. మెడికల్ కాలేజీల విద్యార్థులు, వైద్య సిబ్బందితో పాటు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు సంబంధించిన వైద్య సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది పెద్దఎత్తున ర్యాలీలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఒపి సేవలు నిలిపివేసి పలు చోట్ల ధర్నా చేపట్టారు. హత్యాచారానికి




గురైన వైద్యురాలికి న్యాయం చేయటంతోపాటు, సిపిఎ చట్టం అమలు చేసే వరకు నిరసనలు కొనసాగించనున్నట్లు వైద్యులు పేర్కొన్నారు.

### ఇందిరాపార్క్ వద్ద వైద్యుల ధర్నా

యువ మహిళా డాక్టర్ హత్యాచార ఘటనపై దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా ఐఎంఎ తెలంగాణ విభాగం ఆధ్వర్యంలో శనివారం ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించారు. తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్, తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్, తెలంగాణ టీచింగ్ డాక్టర్స్ అసోసియేషన్‌తో పాటు అన్ని వైద్య సంఘాలు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ఎంపిలు కడియం కావ్య, ఈటల రాజేందర్ వైద్యుల ఆందోళనలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కడియం కావ్య మాట్లాడుతూ, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, న్యాయవ్యవస్థ కఠినంగా వ్యవహరించి నిందితులను అత్యంత కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విధినిర్వహణలో ఉన్న మహిళా వైద్యుల రక్షణకు చట్టాలు తీసుకురావలసిన అవసరం ఉందని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా వైద్యులపై జరిగే దాడుల పరిష్కారానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలనీ, దాడులకు పాల్పడే నిందితులకు కఠిన శిక్షలు అమలు చేయాలనీ అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్నీ ప్రభుత్వ, ప్రయివేట్ మెడికల్ కళాశాలలు, అస్పత్రులలో భద్రతను పెంచి, వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

## మాజీ ఎమ్మెల్యే భూకబ్జా.. సీఎం దృష్టికి తీసుకెళ్తా: ఎంపీ శబరి



**నంద్యాల (జర్నలిస్ట్ ఫైల్):** గత వైసీపీ నేతలు, మాజీ ఎమ్మెల్యే అనుచరులు భూకబ్జాలకు పాల్పడ్డారని.. నంద్యాల పార్లమెంట్ సభ్యుడు, లోకసభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి తీవ్ర ఆరోపణలు చేశారు. నంద్యాల జిల్లా పాణ్యం నియోజకవర్గం కల్లూరు మండల పరిధిలోని జగన్నాథ గట్టు ప్రాంతంలో దాదాపు 79 ఎకరాల భూమిన కబ్జా చేశారని ఎంపీ శబరి అన్నారు. ఆదివారం జగన్నాథ గట్టు పరిసర ప్రాంతంలో బాధితులతో వెళ్లి కబ్జాకు గురైన భూములను పరిశీలించారు.

అనంతరం విలేకరుల సమావేశం మాట్లాడుతూ జగన్నాథ్ గట్టు పరిసర ప్రాంతంలోని సర్వే నంబర్ 139లో అనేక అక్రమాలు జరిగినట్లు పేర్కొన్నారు. జగన్నాథ గట్టు దగ్గర 79 ఎకరాల భూమిని కబ్జా చేశారని ఆమె ఆరోపించారు. తడకనపల్లికి వెళ్లే రహదారిని మాజీ ఎమ్మెల్యే అనుచరులు ఆక్రమించుకుని లక్ష్మీ పురం గ్రామానికి వెళ్లకుండా అడ్డుకోవడం దారుణమన్నారు.

రెవిన్యూ అధికారులను మేనేజ్ చేసి ఎవరు తెలియకున్నప్పటికీ బినామీ పేర్లపై వారికి పట్టాలిచ్చారని కూడా ఆరోపించారు. ఓ ప్రభుత్వ అధికారి, ఓ కానిస్టేబుల్ ఫామ్ హౌస్ కూడా నిర్మించుకున్నారంటే ఆ ప్రభుత్వంలో అవినీతి ఎంత దారుణంగా ఉందో మీకే తెలుస్తుంది.

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇటీవల నంద్యాల పర్యటనకు వచ్చినప్పుడు నీతిమాటలు వల్లించటమే కాకుండా లాండ్ ఆర్డర్ దెబ్బతిందని అన్నారు. గత ఐదేళ్లలో ఆయన ప్రభుత్వంలో ఏం జరిగిందో లా అండ్ ఆర్డర్ పరిస్థితి ఏ విధంగా ఉందో ప్రజలందరికీ తెలుసు అని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యేలు ఎండోమెంట్ భూములను చెరువులను కుంటలను కూడా వదలకుండా అక్రమించుకున్నాడని ఆరోపించారు.

ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తానని, పేదలకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తానని ఆమె పేర్కొన్నారు. ఇంత మందిని మోసం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు కృషి చేస్తానన్నారు. ఇలాంటి ఆక్రమణలకు పాల్పడిన వారికి న్యాయం చేస్తామని, ఆ హామీ మేరకు పేద ప్రజలకు న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు అని ఆమే పేర్కొన్నరు.

## స్విమ్స్ ఆస్పత్రి వద్ద మూర్చ రోగుల ధర్నా



**తిరుపతి (జర్నలిస్ట్ ఫైల్):** మూర్ఛరోగులకు రెండు నెలలకు ఒకసారి స్విమ్స్ హాస్పిటల్ ఉచితంగా ఇచ్చే మందుల కోసం ఆదివారం మూర్ఛరోగులు హాస్పిటలుకు చేరుకున్నారు. స్విమ్స్ యాజమాన్యం ఆదివారం మందులు పంపిణీ చేసేది లేదని చెప్పడంతో మూర్ఛ రోగులు చాలా ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న సిపిఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం అక్కడికి చేరుకొని మూర్ఛ రోగులతో కలిసి మందులు పంపిణీ చేయాలని ధర్నా చేపట్టారు. ఈ ధర్నా ఉద్దేశించి సిపిఎం నగర కార్యదర్శి టి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ %ా% మూర్ఛ రోగులు రెండు నెలలకు ఒకసారి ఇచ్చే మందుల కోసం నేడు ఆసుపత్రికి వస్తే మందులు పంపిణీ చేసేది లేదని స్విమ్స్ హాస్పిటల్ సిబ్బంది చెప్పడం సరైంది కాదన్నారు. తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుండి మూర్ఛ రోగులు వచ్చారని అన్నారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఇక్కడికి చేరుకున్న తర్వాత నెల తర్వాత రావాలని చెప్పడంతో వారు తీవ్రమైన ఆందోళనకు గురయ్యారని అన్నారు. మూర్ఛరోగుల జీవితాలతో ఆడుకోవద్దని స్విమ్స్ హాస్పిటల్ సిబ్బందికి తెలిపారు. మందులు పంపిణీ చేసే వరకు ఇక్కడి నుండి కదిలేది లేదని చెప్పడంతో, హాస్పటల్ సిబ్బంది మందులు పంపిణీ చేస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు. మూర్ఛరోగుల సమస్యల పరిష్కారం కోసం సిపిఎం అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం వారి సమస్యలు పరిష్కారం కోసం మూర్ఛ రోగులతో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ కమిటీ ఆధ్వర్యంలో సమస్యలపై ఆందోళన చేపడతామని టి సుబ్రమణ్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి, గిరిబాబు, రాణి, సుబ్రమణ్యం రెడ్డి, మురళి నాయుడు, నగీన , హసన్, వేణుగోపాల్, అలేఖ్య, మస్తాన్, శంకరయ్య, జై రామయ్య పాల్గొన్నారు

## వివాహితపై అత్యాచారయత్నం చేసిన ముగ్గురి అరెస్టు

**ఏలూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వివాహితపై అత్యాచారయత్నానికి పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఏలూరు డిఎస్పీ శ్రావణ్ కుమార్ వెల్లడించారు. మహిళలపై అత్యాచారాలు, హత్యాచారాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని డిఎస్పీ హెచ్చరించారు. ఈనెల 17న అర్ధరాత్రి మద్యం సేవించిన ముగ్గురు యువకులు మహిళపై అత్యాచారయత్నం చేయడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అయితే నిందితులను గంటల వ్యవధిలోనే అరెస్టు చేసినట్లు డిఎస్పీ వెల్లడించారు.

ఈ సందర్భంగా డిఎస్పీ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. " చింతలపూడి మండలం ధర్మాజీగూడెంకు చెందిన మహిళ భర్త చనిపోవడంతో గత కొన్ని రోజులుగా మరో వ్యక్తితో సహజీవనం చేస్తోంది. అయితే పొట్టకూటి కోసం వీరిద్దరూ పది రోజుల క్రితం ఏలూరు నగరానికి వచ్చారు. హొటళ్లు, ఇతర ప్రదేశాల్లో పని చేస్తూ జీవిస్తున్నారు. నగరానికి కొత్తగా రావడంతో వారికి ఇంకా ఇళ్లు అద్దెకు దొరకలేదు. దీంతో వారు ఒకటో పట్టణ పరిధిలోని దేవాలయం ఆవరణలో ఉంటున్నారు. ఈనెల 17న రాత్రి నూతిపల్లి పవన్, నారపాటి నాగేంద్రబాబు, విజయ్ కుమార్ అనే ముగ్గురు వ్యక్తులు వారి వద్దకు వెళ్లారు. వారితో మాటలు కలిపి మహిళతో సహా అందరూ మద్యం తాగారు. అనంతరం ఆమె భర్త నిద్రలోకి జారుకోగానే ఆమెను పక్కకు తీసుకెళ్లారు. వివాహితపై అత్యాచారం చేసేందుకు ప్రయత్నించారు. ఆమె కేకలు విన్న భర్త, మరో స్థానికుడు ఆమెను కాపాడేందుకు వెళ్లడంతో నిందితులు పారిపోయారు. అనంతరం బాధితుల ఫిర్యాదు మేరకు అక్కడికి చేరుకున్నాం. ఆమె వెంటనే ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించాం. ఘటనపై కేసు నమోదు చేసిన ఒకటో పట్టణ ఎస్సై లక్ష్మణ్ గంటల వ్యవధిలోనే ముగ్గురినీ అరెస్టు చేశారు. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించారు. అయితే పోలీసులు సమయానికి స్పందించలేదని వస్తున్న ఆరోపణలు అవాస్తవం" అని తెలిపారు.

# చిన్నారుల మృతి బాధాకరం

- కుటుంబాలకు అండగానిలబడతాం
- పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్



**గుంటూరు, పెదకాకాని (జర్నలిస్ట్ ఫైల్):** మండలం కేంద్రమైన పెదకాకాని లూథర్ గిరి ఏరియాలో శుక్రవారం ఇంటి ప్రహరీ గోడ కూలి కోలాటపు స్వాతిక్ (11) 6వ, తరగతి, బంగారపు సిద్ధార్థ (13)7వ,తరగతి చదువుతున్నారు. మృతుల పార్థవదేహాలను సందర్శించి ఘననివాళలు అర్పించి, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు అనంతరం. ప్రజలు శిథిలావస్థలో ఉన్న కట్టడాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనంతరం పెదకాకాని తెలుగుదేశం పార్టీ తరఫున మృతుల కుటుంబాలకు రూ. 5 వేల మత్తు కత్తుల నిమిత్తం అందజేశారు. కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ,,టిడిపి నాయకులు కొర్రపాటి సురేష్,,మండల టిడిపి నాయకులు లింగంగుంట సాల్మన్ రాజు(బుజ్జి), పొన్నూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి ఆత్మకూరి వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లెద్దు సుశీలరావు, మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు బెజ్జం గోపాలకృష్ణ,టిడిపి నేతలు కోలాటపు మాణిక్యరావు,ఆత్మకూరి ఆది నారాయణ, లింగంగుంట అశోక్ ,మండే వెంకటేశ్వర్లు , బుర్రా గోవిందరావు,కోలాటపు రాజు, గంజి రవితేజ, తదితరులున్నారు.

## మంగళగిరిలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374 వ జయంతి వేడుకలు

- నియోజకవర్గ గౌడ సంఘం అధ్యక్షుడు వాకా మాధవరావు గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు
- చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన గౌడ సంఘం సభ్యులు
- విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్నిళ్లు పంపిణీ



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి పట్టణంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374 వ జయంతి వేడుకలను నియోజకవర్గ గౌడ సంఘం అధ్యక్షులు వాకా మాధవరావు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సర్దార్ గౌతు లచ్చన్న గౌడ కమ్యూనిటీ హాలులో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు..

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర గౌడ సంఘ అధ్యక్షులు వాకా రామ్ గోపాల్ గౌడ్ పాల్గొని... విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్నిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గౌడ్ సంఘ అధ్యక్షులు వాకా రామ్ గోపాల్ గౌడ్ , నియోజకవర్గ గౌడ సంఘ అధ్యక్షుడు వాకా మాధవరావు వారు మాట్లాడుతూ సుమారు 350 ఏళ్ల క్రితం ఆనాటి మొగల్ పాలకుల దౌర్జన్యాలకు, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన చత్రపతి శివాజీ సమకాలికులు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని పేర్కొన్నారు. మహనీయులు ఏ ఒక్క కులం కోసం కాకుండా అందరి కోసం పాటుపడ్డారని అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న ఆనాటి పాలకుల అరాచకాలను అణిచివేసి అణగారిన వర్గాల పేదల కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాడారని గుర్తు చేశారు. అన్నివర్గాల వారు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కావాలని, ప్రజాస్వామిక స్ఫూర్తితో పోరాడడం గొప్ప విషయమని కొనియాడారు. ప్రతిఒక్కరూ వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో నాయకులు కంచర్ల కాశయ్య, ఎనుముల నరసింహారావు, తాత కోటయ్య, తాత సాంబశివరావు, పాగోలు శ్రీనివాసరావు, పంది దుర్గారావు, పాగోలు సాయి, పలగాని భాను కుమార్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## వైద్య విద్యార్థిని పై అత్యాచారం హత్య ఘటన నిర్వహిస్తూ

- ఎయిమ్స్ వైద్యుల మెగా ర్యాలీ
- కొవ్వొత్తుల ప్రదర్శన
- నిందితుల్ని కఠినంగా శిక్షించాలి
- వైద్యుల డిమాండ్




**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** కలకత్తా లో వైద్య విద్యార్థిని పై ఆత్యాచార,, హత్య ఘటనకు నిరసనగా మంగళగిరి ఎయిమ్స్ వైద్యుల మెగా ర్యాలీ నిర్వహించారుఅంబేద్కర్ సెంటర్లో వైద్య విద్యార్థుల మానవహారం, ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. కోల్కతా ఆర్ జి కర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పటల్లో ట్రైనీ డాక్టర్ పై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ ఎయిమ్స్ ఫ్యాకల్టీ డాక్టర్లు, ఇంటర్న్ మరియు వైద్య విద్యార్థులు

మెగా ర్యాలీ నిర్వహించారు. ఘటనకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించి న్యాయం చేయాలని, ప్రభుత్వం ప్రత్యేక రక్షణ కల్పించాలని కోరుతూ మంగళగిరి ఎయిమ్స్ వెనుక ద్వారం నుండి మంగళగిరి గౌతమ బుద్ధ రోడ్డు అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. వైద్య విద్యార్థినిపై జరిపిన అత్యాచారం అచ్చంత పాశవికమని ఖండించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం సెంటర్ వద్ద ఎయిమ్స్ వైద్య విద్యార్థులు ఫ్లాష్ మాబ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా మానవహారంగా ఏర్పడి, కొవ్వొత్తులు వెలిగించి నిరసనను వ్యక్తం చేశారు. ఎయిమ్స్ వైద్యులు, ఇంటర్న్, వైద్య విద్యార్థులు ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో ప్రజారోగ్య వేదిక, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొని మద్దతు తెలిపారు.

# ఏపీయూడబ్ల్యూజే అలుపెరుగని పోరాటం ..

- యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్.
- మంగళగిరి కమిటీ తరఫున నిర్వహించిన పండ్లు, స్వీట్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న చందు జనార్ధన్.
- ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి జర్నలిస్టుల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ అలుపెరుగని పోరాటం చేస్తోందని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్ అన్నారు. ఏపీయూ

డబ్ల్యూజే 67వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మంగళగిరి నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో కాజ లో గల ఆమోదిని బాలికల అనాథ శరణాలయంలో శనివారం సాయంత్రం పండ్లు, స్వీట్లు, స్నాక్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. చందు జనార్ధన్ ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ ప్రారంభించారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతర పోరాటం చేస్తున్న ఏకైక యూనియన్ ఏపీయూడబ్ల్యూజే అని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే గుంటూరు జిల్లా అధ్యక్షులు షేక్ ఎన్ మీరా, ఐ జె యూ సభ్యులు ఓ మార్కండేయులు,జిల్లా ఉపాధ్యక్షులు జొన్న రాజేష్,సహాయ కార్యదర్శి కుక్కమళ్ల జయరాజు, మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు జొన్న వెంకటేష్, కార్యదర్శి బత్తుల సాంబశివరావు, నియోజకవర్గ గౌరవాధ్యక్షులు కూరపాటి మురళి రాజు,ఉపాధ్యక్షులు షేక్ సుభాని,ఆర్గనైజింగ్ సెక్రటరీ కె కమల్, కార్యవర్గ సభ్యులు ప్రదీప్, సందీప్ ఐబీఎన్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఐ వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదు



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి రూరల్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం నాడు కౌన్సిలింగ్ నిర్వహించారు . తమ దగ్గరికి వచ్చే ఏ కేసులోను మీ పేరు వినిపించకూడదు,గంజాయి అమ్మిన, సేవించే వారి సమాచారం వెంటనే పోలీసులకు తెలపాలన్నారు. సత్ప్రవర్తన కలిగినవారిపై రౌడీషీట్లను తొలగించడానికి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా పెడతామన్నారు. రౌడీ షీటర్లు అల్లర్లకు ప్రేరేపించిన అల్లర్లకు పాల్పడిన పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని రౌడీషీటర్లకు ఎస్సై వెంకట్ , సీఐ శ్రీనివాసరావు హెచ్చరికలు జారీ చేశారు.

## రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలలో విద్యార్థి ప్రతిభ



**గుంటూరు, పెదకాకాని (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలలో ఎస్ హెచ్ కె వి పి బి ట్రస్ట్ స్కూల్ విద్యార్థి ప్రతిభ కనబరిచినట్లు ఆ పాట చాలా ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ ఎన్. శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 10, 11 తేదీలలో కర్నూలు జిల్లా వాగ్గేయపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆంధ్ర ప్రదేశ్ రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ వారు నిర్వహించిన 7వ,అంతర్ జిల్లా రోప్ స్కిప్పింగ్ ఛాంపియన్షిప్ అండర్ 10 విభాగం గుంటూరు జిల్లా క్రీడాకారుడు కోగంటి హర్ష కుమార్ కాంచీ పథకం సాధించినట్లు తెలిపారు. త్వరలో జరిగే పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

## రాయలసీమలోని ప్రాజెక్టులన్నీ నిండేవరకు నీటిని దిగువకు



**కడప (జర్నలిస్ట్ ఫైల్):** రాయలసీమ కరువు రైతులకు వ్యవసాయంలో ఇబ్బందులు లేకుండా కనీస పంటలు పండాలంటే, శ్రీశైలం ప్రాజెక్టు మినిమం లెవల్ 854 అడుగుల వరకు తగ్గకుండా నీరు ఉండాలని,శ్రీశైలం ప్రాజెక్టులో విద్యుత్తు ఉత్పత్తిని నిలుపుదల చేసి రైతులను కాపాడాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి అన్నారు. ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నగర కార్యదర్శి మక్బూల్ భాషతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు అనంతరం రవిశంకర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ,నాగార్జున సాగర్, పులిచింతల ప్రాజెక్టులు అంచుల వరకు ఉన్న తరుణంలో రాయలసీమ ప్రాంతంలో ఉన్న అన్ని నీటి రిజర్వాయర్ లు నిండే వరకు శ్రీశైలం ప్రాజెక్టులో విద్యుత్తు ఉత్పత్తిని నిలుపుదల చేయాలని, ఇప్పుడు కూడా దిగువకు నీరు వదలడం ద్వారా రాయలసీమ రైతులకు తీరని ద్రోహం చేసిన వారు అవుతారని, రెండు తెలుగు రాష్ట్రాలు ప్రజా ప్రతినిధులు ఆలోచించాల్సిన అవసరం వచ్చిందని ఆయన గుర్తు చేశారు. శ్రీశైలం ప్రాజెక్టులో 854 అడుగుల వరకు నీళ్లు ఉంచి రాయలసీమ కరవు నివారణ నుండి కాపాడాలని ఆంధ్ర ప్రదేశ్ లోని కూటమి ప్రతినిధులు ఈ విషయమై ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని ఆయన సూచించారు.

## భారతదేశంలో ఇలాంటి సంఘటన జరగడం సిగ్గుచేటు




**గుంటూరు, పెదకాకాని (జర్నలిస్ట్ ఫైల్):** స్త్రీని శక్తిగా పూజించే భారతదేశంలో ఇటువంటి సంఘటన జరగడం దురదృష్టకరమని తక్కెళ్ళపాడు సిబార్ దంత కళాశాల డాక్టర్ డీన్ లింగమనేని కృష్ణ ప్రసాద్ అన్నారు. కలకత్తాలోని ఆర్ జి కర మెడికల్ కాలేజ్ నందు జరిగిన హత్యాచార ఘటనకు నిరసనగా శనివారం మండల పరిధిలోని తక్కెలపాడు సిబార్ డెంటల్ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు ర్యాలీగా తక్కెళ్ళపాడు గ్రామపంచాయతీ వరకు కొనసాగించారు. ఈ సందర్భంగా కళాశాల డీన్ మాట్లాడుతూ అమనవీయమైన, కృరమైన చర్యని దీనిని అందరూ ముక్తకంఠంతో ఖండించాలని అన్నారు. స్వాతంత్ర భారతదేశంలో ఇలాంటి సంఘటనలు ఇంకా జరగడం చాలా బాధాకరమని అన్నారు. ఇటువంటి సంఘటనలో పునరావృతం కాకుండా ఉండాలంటే చట్టాలను పదును పెట్టాలని, దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ టి.కృష్ణమోహన్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బివి. రమణారెడ్డి,ఇతర అధ్యాపకులు,స్టూడెంట్ కౌన్సిల్ ప్రతినిధులు, విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రీన్ ఎనర్జీ ఛాంపియన్‌గా రాష్ట్రానికి అవార్డు



- మంత్రి గొట్టిపాటి హర్షం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** గ్రీన్ ఎనర్జీ ఛాంపియన్‌గా ఇండియన్ విండ్ పవర్ అసోసియేషన్ రాష్ట్రాన్ని గుర్తించి అవార్డు ప్రకటించింది. 2023-24 ఏడాదికి గానూ ఈ అవార్డును అందించింది. తమిళనాడులోని కోయంబత్తూరు వేదికగా జరిగిన ఇండియన్ విండ్ పవర్ అసోసియేషన్ సమావేశంలో ఎపి ఈ అవార్డు సొంతం చేసుకుంది. పవన విద్యుత్ జాయింట్ సెక్రటరీ లలిత్ బోరా చేతుల మీదుగా ఎపి సోలార్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎమ్‌డి అండ్ సిఇఒ ఎం కమలాకర్ బాబు ఆదివారం అందుకున్నారు. 2014-19 కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పునరుత్పాదక విద్యుత్‌కు ఇచ్చిన ప్రాధాన్యత వల్లే రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీ ఛాంపియన్‌గా నిలబెట్టిందని కమలాకర్ బాబు ఈ సందర్భంగా తెలిపారు. మిగిలిన రాష్ట్రాలతో పోల్చితే పునరుత్పాదక విద్యుత్‌కు రాష్ట్రం పెద్దపీట వేస్తోందని వెల్లడించారు. ఈ అవార్డు రావడం పట్ల విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు. సిఎం చంద్రబాబు దూరదృష్టితో తీసుకున్న నిర్ణయాలు ప్రస్తుతం సత్ఫలితాలు ఇస్తున్నాయని తెలిపారు. పునరుత్పాదక విద్యుత్‌కు ఎపి పెద్దపీట వేస్తుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467